# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :55 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 26-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## సామాజిక కార్యకర్త మేధా పాట్కర్ అరెస్టు

న్యూఢిల్లీ: నర్మదా బచావో ఆందోళన్ నేత, సామాజిక కార్యకర్త మేధా పాట్కర్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల ఆమెపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయిన విషయం తెలిసిందే. 24 ఏళ్ల క్రితం నాటి పరువునష్టం కేసులో మేధా పాట్కర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రొబేషన్ బాండ్లను ఆమె సమర్పించలేదు. 2000 సంవత్సరంలో పాట్కర్‌పై కేసు నమోదు అయ్యింది. అయితే బుధవారం ఢిల్లీ కోర్టు ఆ కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కేసులో రెండు వారాల పాటు స్టే ఇవ్వాలని పెట్టుకున్న పాట్కర్ అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది. గుజరాత్‌లోని ఓ ఎన్జీవో కు ఎల్‌జీ సక్సేనా అధినేతగా ఉన్న సమయంలో మేధా పాట్కార్ తీవ్ర ఆరోపణలు చేశారు. అతనో పిరికివాడు అని, హవాలా కుంభకోణానికి పాల్పడినట్లు మేధా పాట్కర్ ఆరోపించారు.

## హాఫీజ్ సయీద్ నేతృత్వంలోనే పహల్గామ్ దాడి.. నివేదిక వర్గాలు నిర్ధారణ!



న్యూఢిల్లీ,పహల్గామ్ ఉగ్ర దాడి వెనుక ఉన్న కుట్రను కేంద్ర సంస్థలు వెలికితీస్తున్నాయి. 26/11 ముంబై దాడుల కుట్రదారుడు, లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ ఆధ్వర్యంలోనే పహల్గామ్ ఉగ్ర దాడి జరిగినట్లుగా భద్రతా సంస్థలు ఇక నిర్ధారణకు వచ్చినట్లు వర్గాలు పేర్కొన్నాయి.పహల్గామ్ దాడి జరగగానే తామే ఈ దాడి చేసినట్లుగా ఉగ్రవాద సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది. ఇది లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థగా ఉంది. దీనికి హాఫీజ్ సయీద్ ముఖ్య అనుచరుడైన సైఫుల్లా ఖలీద్ అలియాస్ సైఫుల్లా కసూరి నేతృత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం వీరిద్దరి ఆధ్వర్యంలోనే ఈ ఉగ్ర సంస్థలు నడుస్తున్నాయి. ఇద్దరి మాడ్యూల్ ప్రకారం పహల్గామ్ దాడి జరిగినట్లుగా భారత నిఘా సంస్థలు కనిపెట్టాయి. ఇక ఈ ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ సైన్యం, ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) పూర్తి మద్దతు ఉంటుంది. సైద్ధాంతిక, లాజిస్టికల్ మరియు వ్యూహాత్మక మద్దతు ఇస్తుంటాయి.ఇక స్థానిక ఉగ్రవాదుల మద్దతుతో బైసరన్ లోయలో లష్కరే తోయిబా దాడులకు పాల్పడినట్లుగా గుర్తిం చింది. ముందుగా అక్కడ గ్రౌండ్ వర్క్ కూడా చేసినట్లుగా అనుమానిస్తున్నారు. స్థానిక మద్దతుదారుల సహకారంతోనే ఈ ఉగ్ర దాడి జరిగినట్లుగా ఒక నిర్ధారణకు వచ్చారు. 2024, అక్టోబర్‌లో బూటా పత్రి దగ్గర జరిగిన ఉగ్ర దాడిలో కూడా ఈ పహల్గామ్‌లో పాల్గొన్నవారే ఉన్నట్లుగా గుర్తించింది. ఆ దాడిలో ఇద్దరు సైనికులతో పాటు నలుగురు సామాన్య పౌరులు చనిపోయారు. అదే నెలలో సోనామార్గ్‌లో సొరంగం నిర్మాణ కార్మికులపై జరిగిన ఉగ్రదాడిలో ఆరుగురు కార్మికులు, ఒక వైద్యుడు చనిపోయాడు. ఈ దాడిలో కూడా ఈ ఉగ్రవాదులే పాల్గొన్నట్టుగా కనిపెట్టారు. వీళ్లంతా లష్కరే తోయిబా కనుసన్నల్లో నడుచుకుంటున్నట్లుగా గుర్తించారు. పహల్గామ్ ఉగ్రవాదుల్లో విదేశీయులు కూడా ఉన్నట్లుగా అనుమానిస్తున్నారు.ఇక మంగళవారం ఉగ్రదాడిలో పాల్గొన్న ముష్కరులు ఊహాచిత్రాలను బుధవారం విడుదల చేశారు. ముగ్గురు ఉగ్రవాదుల్లో పాకిస్థాన్‌కు చెందిన హాషీమ్ ముసా అలియాస్ సులేమాన్, అలీ భాయ్ అలియాస్ తల్హా, మూడో వ్యక్తి స్థానిక నివాసి అబ్దుల్ హుస్సేన్ థోకర్‌గా గుర్తించారు. ఇక వీళ్ల సమాచారం అందిస్తే.. రూ.20లక్షల రివార్డ్ ఇస్తామని ఇప్పటికే భద్రతా దళాలు ప్రకటించాయి.పహల్గామ్ ఉగ్ర దాడిలో 26 మంది చనిపోయారు. ఇందులో ఎక్కువగా కొత్తగా పెళ్లైన వారే ఉండడం విశేషం. అనేక మంది గాయాలు పాలయ్యారు. ప్రస్తుతం వారంతా కోలుకుంటున్నారు. ఇక ఈ ఘటనతో బాధితులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇప్పటికీ ఆ ఘటనను నుంచి తేరుకోలేకపోతున్నారు. ప్రస్తుతం పాకిస్థాన్-భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాక్‌పై భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది.

## పాక్ పాత్రపై విదేశీ రాయబారులకు ఆధారాలు చూపించిన భారత్



న్యూఢిల్లీ,పహల్గామ్ ఉగ్ర దాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉన్నట్లుగా భారత్ గుర్తించింది. లష్కరే తోయిబా లాంటి ఉగ్రవాద సంస్థలను దాయాది దేశం పెంచిపోషిస్తోంది. ఇక పహల్గామ్ ఉగ్ర దాడికి పాల్పడింది తామేనని లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఇప్పటికే ప్రకటించింది.అయితే వెనుకుండి లష్కరే తోయిబానే చేయించినట్లుగా నిఘా వర్గాలు గుర్తించాయి.తాజాగా పహల్గామ్ ఉగ్రదాడిలో పాకిస్థాన్‌కు సంబంధించిన పాత్రను విదేశీ రాయబారులకు కేంద్ర ప్రభుత్వం ఆధారాలు చూపించింది. పాకిస్థాన్ మద్దతుతోనే ఉగ్రవాద కార్యకలాపాలు జరుగుతున్నాయని పేర్కొంది. దౌత్యవేత్తలకు విదేశాంగ శాఖ ఆధారాలు చూపించింది. ఆధారాలపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి దేశాలైన అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, యూకే స్పందించాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఖండిస్తున్నట్లు దేశాలు పేర్కొన్నాయి. తాజా ఆధారాలతో భవిష్యత్‌లో భారత్ ఏ చర్యలు తీసుకున్నా.. అభ్యంతరాలు రావని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పాక్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది.మంగళవారం పహల్గామ్‌లో ఉగ్రమూకల దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల కొద్దీ గాయపడ్డారు. ఈ ఘటనలో ఎక్కువగా కొత్తగా పెళ్లైన వారే ప్రాణాలు కోల్పోయారు. ఇక ఈ ఘటన తర్వాత భారత ప్రభుత్వం చాలా సీరియస్ అయింది. పాకిస్థాన్‌పై కఠినమైన నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే సింధు జలాలను నిలిపివేసింది. అంతేకాకుండా పాకిస్థానీయుల వీసాలను రద్దు చేసింది. అలాగే అటారీ-వాఘా సరిహద్దును మూసేసింది.

## హైదరాబాద్‌లో అట్టహాసంగా ప్రారంభమైన భారత్ సమ్మిట్ 2025




హైదరాబాద్, పెట్టుబడులు, న్యాయం, ప్రపంచ శాంతి, అహింస అనే మహత్తర లక్ష్యాలతో ప్రతిష్ఠాత్మక భారత్ సమ్మిట్ - 2025 నేడు హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది.నగరంలోని హైటెక్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ), నోవాటెల్‌లో రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది. ఈ అంతర్జాతీయ సదస్సుకు 100కు పైగా దేశాల నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. భారత్ సమ్మిట్‌కు విచ్చేసిన వివిధ దేశాల ప్రతినిధులకు తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా అపూర్వ స్వాగతం లభించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు సాంప్రదాయబద్ధమైన బోనాలు, డప్పు చప్పుళ్లతో వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను తెలియజేసే ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్ సందర్శకులకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించనుంది.ఈ అత్యంత ముఖ్యమైన సమ్మిట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొననున్నారు. అంతేకాకుండా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)కి చెందిన అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ వంటి ప్రముఖులు కూడా ఈ సదస్సులో పాల్గొని తమ విలువైన అభిప్రాయాలను పంచుకోనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయిలో న్యాయం, శాంతిని నెలకొల్పడం, అహింసా మార్గాన్ని ప్రోత్సహించడం ఈ సమ్మిట్ యొక్క ప్రధాన ఉద్దేశాలు. రానున్న రెండు రోజుల్లో వివిధ దేశాల ప్రతినిధులు పెట్టుబడుల అవకాశాలు, అంతర్జాతీయ సంబంధాలు, శాంతి స్థాపన వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చలు జరపనున్నారు. ఈ సమ్మిట్ ప్రపంచ వేదికపై భారతదేశ ప్రాముఖ్యతను మరింతగా చాటిచెబుతుందని భావిస్తున్నారు.

## ఉగ్రవాదుల ట్రాప్ ... త్రుటిలో తప్పించుకున్న భద్రతా బలగాలు



శ్రీనగర్ : పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన టెర్రరిస్ట్ కోసం వేట ప్రారంభించిన భద్రతా దళాలు పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి.. చివరి నిమిషంలో అప్రమత్తం కావడంతో 60 మంది ఆర్మీ సిబ్బంది సురక్షింతంగా బయటపడ్డారు. కాగా ఈ ఉగ్రదాడిలో పాల్గొన్న వారిని పట్టుకుందుకు భద్రతా దళాలు తనను వెతుక్కుంటూ ఇంటికి వస్తారని అంచనా వేసిన పహల్గాం దాడి ఉగ్రవాది ఆసిఫ్ ఫౌజీ ఇంట్లో ఐఈడీలు పెట్టి భద్రతా దళాలకు వారికి ట్రాప్ పెట్టాడు. అయితే త్రుటిలో ఆ ప్రమాదం నుంచి భద్రతా సిబ్బంది తప్పించుకోగలిగారు. ఇలాగే మరో ఉగ్రవాది ఇంట్లోనూ జరగడం గమనార్హం.దక్షిణ కశ్మీర్‌లోని త్రాల్‌కు చెందిన ఉగ్రవాదుల ఆసిఫ్ ఫౌజీ అలియాస్ ఆసిఫ్ షేక్ , ఆదిల్ థోకర్ అలియాస్ ఆదిల్ గురి ఇళ్లల్లో సోదాలు జరపడానికి జమ్మూకశ్మీర్ పోలీసులు వెళ్లారు. తనిఖీలు చేస్తున్న సమయంలో ఉగ్రవాదుల నివాసాల్లో అమర్చిన పేలుడు పదార్థాలు యాక్టివేట్ అయినట్లు గుర్తించారు. క్షణాలలో అక్కడే ఉన్న ఆరవై మందికి పైగా ఉన్న భద్రతా సిబ్బంది స్పందించి ఆ ఇళ్ల నుంచి, పరిసరాల నుంచి అత్యంతవేగంగా దూరంగా వెళ్లిపోయారు. వారి సురక్షిత ప్రాంతాలకు చేరుకున్న కాసేపటికే భారీగా పేలుళ్లు సంభవించాయి.గాలింపు చర్యలకు వచ్చిన సమయంలో వారికి హాని కలిగించాలనే ఉద్దేశంతోనే ఉగ్రవాదులు ముందుగానే తమ ఇళ్లల్లో పేలుడు పదార్థాలు అమర్చి.. ఈ నివాసాల సమాచారం భద్రతా దళాలకు అందేలా ప్లాన్ చేసి ఉంటారని ఓ పోలీసు అధికారి మీడియా వద్ద అనుమానం వ్యక్తం చేశారు.2018లో అదిల్ చట్టబద్ధంగా పాకిస్థాన్ వెళ్లి, గతేడాది జమ్మూకశ్మీర్‌కు తిరిగి వచ్చాడని.. ఇన్నాళ్లు అక్కడ ఉగ్రవాద శిబిరాల్లో శిక్షణ పొందాడని అధికారులు వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడిలో పాల్గొన్న ముగ్గురు టెర్రరిస్టుల ఊహాచిత్రాలను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు. మూసా, యూనిస్, ఆసిఫ్ అనే కోడ్‌నేమ్‌లు కూడా ఉన్నట్లు పేర్కొంది. ఆదిల్ థోకర్ అనే మరో ఉగ్రవాదికి కూడా వీరితో సంబంధం ఉందని తెలిపింది. వీరందరూ జమ్మూకశ్మీర్ కేంద్రంగా పనిచేసే ది రెసిస్టెన్స్ ఫ్రంట్ లో సభ్యులు. ఉగ్రదాడి నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ప్రకారం ఈ ఊహా చిత్రాలను గీశారు. టెర్రరిస్టులు పురుషులను వేరు చేసి వారి గుర్తింపులను పరిశీలిస్తున్న సమయంలో బాధితులు వారి ముఖాలను చూశారు. ఈ ఫొటోల ఆధారంగా వీరి కోసం భద్రతా సిబ్బంది వేట మొదలుపెట్టారు.

## ఉగ్రవాదుల కోసం వేట.. పారామిలిటరీ బలగాలకు సెలవులు రద్దు



జమ్ము కశ్మీర్: పెహల్‌గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం అప్రమత్తమైంది. పొరుగు దేశంతో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పారామిలిటరీ బలగాలకు (పారామిలిటరీ బలగాలు) సెలవులు రద్దు చేశారు. ఇప్పటికే సెలవులపై వెళ్లిన జవాన్లు వెంటనే రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జమ్ము కశ్మీర్ పరిస్థితులపై అన్ని మిలిటరీ విభాగాల్లో ప్రత్యేక సమావేశాలు జరిగాయి.మరోవైపు ఉగ్రదాడి నేపథ్యంలో జమ్ము కశ్మీర్ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. శ్రీనగర్ విమానాశ్రయంలో కూడా సైన్యం భద్రతను కట్టుదిట్టం చేసింది. కశ్మీర్‌లోయ మొత్తం భద్రతా వలయంలోకి వెళ్లిపోయింది. కశ్మీర్ ప్రాంతంలో ఎక్కడికక్కడ భద్రతా దళాలు మోహరించాయి. ఉగ్రవాదుల కోసం వేట మొదలు పెట్టాయి. అన్ని వైమానిక స్థావరాల్లోనూ యుద్ధ విమానాలు కథన రంగంలోకి దిగేందుకు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు నావికాదళం సముద్రతీర ప్రాంతాలలో భారీ ఎత్తున యుద్ధ నౌకలను మోహరించింది. సరిహద్దులకు వేలాదిమంది సైన్యాన్ని తరలిస్తున్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉంది.మరోవైపు జమ్ము కశ్మీర్‌లో పరిస్థితిని సమీక్షించేందుకు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కాసేపటి కిందే కశ్మీర్‌కు చేరుకున్నారు. శ్రీనగర్, ఉదమ్‌పూర్‌లో ఆయన ఉండనున్నారు. కశ్మీర్ లోయలోని ఆర్మీ కమాండర్లు, ఇతర భద్రతా అధికారుల ప్రతినిధులతో భేటీ కానున్నారు. ఎల్వోసీ వద్ద ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీయనున్నారు. తదుపరి చర్యలపై ద్వివేది వారికి దిశానిర్దేశం చేయనున్నారు. పెహల్‌గామ్ ఉగ్రదాడి ఘటనస్థలాన్ని కూడా ఆయన పరిశీలించే అవకాశం ఉందని తెలిసింది.

## కాంగ్రెస్‌ను,మోడీని ప్రశ్నిస్తూనే ఉంటాం



నిజామాబాద్,ఏప్రిల్25: వరంగల్ రజతోత్సవ సభో కాంగ్రెస్, బిజెపిల హామీలను వారి మోసాలను నిలదీస్తామని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఈ రెండు పార్టీలు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్‌ను,మోడీని ప్రశ్నిస్తూనే ఉంటామని ప్రశాంతరెడ్డి అన్నారు. కెసిఆర్ పాలన, మోడీ పాలనపై ప్రజల్లో చర్చ జరగాలన్నదే తమ లక్ష్యమని వేముల అన్నారు. వ్యవసాయానికి కెసిఆర్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తును అందించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ఎందుకు అందించలేక పోతున్నదని ఆయన అన్నారు. కేంద్రంలోని బిజెపి గ్యాస్ రాయితీ తగ్గించి.. ఎరువులు, యూరియా ధరలు పెంచిందన్నారు. భాజపా సోషల్ మీడియా తప్పుడు ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలన్నారు. బిజెపి అధికారంలో ఉన్న ఏ రాష్ట్రమూ బాగుపడ్డ దాఖలాలు లేవన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో భ్రమపెట్టడం అలవాటు చేసుకున్నారని అన్నారు. రైతురాజ్యం రావాలని, దీనికోసం అందరూ కలిసిరావాలని కెసిఆర్ ఇచ్చిన పిలుపుతో ఇప్పుడు మళ్లీ చర్చ మొదలయ్యిందని అన్నారు. కాంగ్రెస్ పాలనతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. తెలంగాణలో రైతులకు ఇప్పుడు కష్టం వచ్చి పడిందని అన్నారు. గతంలో కెసిఆర్ తీసుకున్న నిర్ణయాల కారణంగా నీటి తీరువా లేదు. విద్యుత్తు చార్జీలు లేవు. ధాన్యం కూడా ప్రభుత్వమే కొన్నది. ఆనాడు రైతులు కెసిఆర్‌ను ఎంతగా ఆదరించారో చూస్తే తెలిసిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందని, కాంగ్రెస్‌పై పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టేందుకు యత్నిస్తున్న తీరును నిలదీయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆశలు రేకెత్తించేలా అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. వందరోజుల్లో హామీలు అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్..ఏడాదిన్నర దాటుతున్నా వాటి విషయంలో ఎక్కడ వేసిన అక్కడే గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు.ఎన్నిసార్లు అబద్దాలు చెప్పుకుంటూ రైతులను ఆగం చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏ ఒక్క హామీని సరిగ్గా అమలుచేసిన దాఖలాలు లేవన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు కేసీఆర్ సైనికుల్లా పనిచేయాలని వేముల సూచించారు. పసుపుబోర్డు, మద్దతు ధర ఇప్పిస్తానని మోసం చేసిన అర్వింద్‌కు బుద్ధి చెప్పాలన్నారు. అబద్దాలు చెబుతున్న కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పకపోతే ఇంకా ఆగం చేస్తారని అన్నారు. వరంగల్ సభతో ప్రజలకు వాస్తవాలు తెలియచేస్తామని అన్నారు.

## కేసీఆర్‌ను దెబ్బ తీసేందుకు ఈ రిపోర్ట్ ఇచ్చారు



హైదరాబాద్, కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్డీఎస్ఏ నివేదికను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.ఆయన వరంగల్‌లో జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్ల గురించి మీడియాతో మాట్లాడారు. ఈ నెల 27న జరగబోయే సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. మేము బీఆర్ఎస్ రజతోత్సవ సభగా ప్రకటించామని, కానీ ప్రజలు దీన్ని కాంగ్రెస్ పార్టీ పాలనపై వ్యతిరేకతగా చూస్తున్నారని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సభ పార్టీ సభ మాత్రమే కాదు, ప్రజల అసంతృప్తికి అద్దం పట్టే మహాసభగా మారిందని అభిప్రాయపడ్డారు. ఇంత ఆదరణ ఏ పార్టీ సభకూ దక్కలేదని, గతంలో మా సభలు ఎంతగా విజయం సాధించాయో అందరికీ తెలిసిందే అన్నారు. ఇప్పుడు ఆ రికార్డులను మేమే తిరగరాస్తున్నామని ఆయన వివరించారు.జగదీష్ రెడ్డి ఎన్డీఎస్ఏ నివేదికపై మండిపడ్డారు. కేసీఆర్‌ను దెబ్బ తీయడానికి కావాలనే ఈ నివేదికను రూపొందించారని ఆయన ఆరోపించారు. ఇది పూర్తిగా పని చేయని నివేదిక అని, శునకానందం, క్షణికానందం కోసం ఈ రిపోర్టును రూపొందించారని ధ్వజమెత్తారు. గుజరాత్‌లో నిర్మాణం పూర్తికాకముందే కూలిపోయిన నిర్మాణాల్లో 150 మంది మృతి చెందిన ఘటనను ఉదహరిస్తూ.. “అప్పుడు ఎన్డీఎస్ఏ ఎందుకు వెళ్లలేదు? కేవలం కాళేశ్వరం కోసమేనా ఈ సంస్థ పనిచేస్తుందా?” అని ప్రశ్నించారు. ఈ నివేదికను చెత్తబుట్టలో వేయడానికే పనికొస్తుందని ఆయన విమర్శించారు. మేడిగడ్డ, కాళేశ్వరం, సుందిళ్ల ప్రాజెక్టులపై వచ్చిన వ్యాఖ్యలన్నీ అర్థరహితమైనవని, కేంద్ర ప్రభుత్వ రాజకీయ దాడుల పాలిట ఈ నివేదిక మారిందని పేర్కొన్నారు.

## రిపీటైతే తీవ్ర చర్యలుంటాయ్.. రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు వార్నింగ్!



న్యూఢిల్లీ,రాహుల్ గాంధీపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత్ జోడో యాత్రలో దివంగత సావర్కర్ ను ‘బ్రిటిష్ ఏజెంట్’గా రాహుల్ అభివర్ణించారు. స్వాతంత్ర్య సమరయోధుల్ని అవమానిస్తే చూస్తూ ఉండబోమని, ఇది మళ్లీ రిపీటైతే తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ పరువు నష్టం కేసులో తనపై జారీ చేసిన సమన్లను కొట్టివేయాలని అలహాబాద్ హైకోర్టు తిరస్కరించిన తీర్పును సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన అప్పీలుపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2022, నవంబరు 17న భారత్ జోడో యాత్రలో దివంగత సావర్కర్ ను ‘బ్రిటిష్ ఏజెంట్’గా రాహుల్ అభివర్ణించారు.

### రిపీటైతే తీవ్ర చర్యలు

ఆ వ్యాఖ్యలపై నమోదైన కేసును కొట్టేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం మండిపడింది. స్వాతంత్ర్య సమరయోధుల్ని అవమానిస్తే చూస్తూ ఉండబోమని తేల్చిచెప్పింది. ఇది మళ్లీ రిపీటైతే తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు శత్రుత్వాన్ని ప్రోత్సహించేలా ఉన్నాయని ఒక న్యాయవాది చేసిన ఫిర్యాదుపై

సంపాదకీయం

శనివారం 26-04-2025

# అనిశ్చితి... అశాంతి... ఇంకెన్ని రోజులు?

కంచే చేను మేస్తే... అనేది మన తెలుగు సామెత! ప్రపంచ భాషలన్నింటిలోనూ బహుశా ఇలాంటిదేదో ఉండే ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అగ్రరాజ్యాధిపతులకు గుర్తు చేయాల్సిన సామెత ఇది! విశ్వ శాంతిని కాపాడతామని రెండో ప్రపంచ యుద్ధం తర్వాత చేతిలో చేయి వేసి చెప్పిన ఆ రాజ్యాధినేతలే ఇప్పుడు మాట తప్పుతుండటం దీనికి కారణం!కంచే చేను మేస్తే... అనేది మన తెలుగు సామెత! ప్రపంచ భాషలన్నింటిలోనూ బహుశా ఇలాంటిదేదో ఉండే ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అగ్రరాజ్యాధిపతులకు గుర్తు చేయాల్సిన సామెత ఇది! విశ్వ శాంతిని కాపాడతామని రెండో ప్రపంచ యుద్ధం తర్వాత చేతిలో చేయి వేసి చెప్పిన ఆ రాజ్యాధినేతలే ఇప్పుడు మాట తప్పుతుండటం దీనికి కారణం!ఆర్థిక మాంద్యం, రెండో ప్రపంచయుద్ధం అనంతరం 1945లో ఐక్యరాజ్య సమితి సాక్షిగా అమెరికా, రష్యా(అప్పటి సోవియట్ యూనియన్), బ్రిటన్, చైనా, ఫ్రాన్స్‌లు భద్రతామండలి శాశ్వత సభ్యదేశాల రూపంలో పెత్తనం స్వీకరించాయి. ఆ తర్వాత ప్రపంచం ఓ ఒరవడి(ఆర్డర్)లో నడిచేందుకు అనేక ఒప్పందాలు, కట్టుబాట్లకు ఐరాస, దాని అనుబంధ సంస్థల ద్వారా బాటలుపడ్డాయి. భద్రతామండలి ద్వారా ప్రపంచ శాంతికి, జెనీవా సదస్సుల ద్వారా మానవ హక్కులకు భరోసా లభించింది. అణునిరాయుధీకరణ ఒప్పందాల ద్వారా అణ్వస్త్రాల నిరోధానికి, బ్రెటన్ వుడ్స్ ఒప్పందాల ద్వారా అంతర్జాతీయ వాణిజ్యం సజావుగా సాగే ఏర్పాట్లు జరిగాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా అన్ని దేశాల్లో ప్రజారోగ్య కార్యక్రమాలకు సాయమందించడం, డబ్ల్యూటీవో రూపంలో వాణిజ్య కార్యకలాపాల్లో సమ్యక్‌దృష్టి లాంటివన్నీ దేశాల మధ్య సంబంధాలు సజావుగా సాగేందుకు ఉద్దేశించినవే! అలాగని ప్రపంచమంతా శాంతి వెల్లివిరిసిందనేమీ కాదు. ప్రచ్ఛన్న వైరాలున్నా, సైద్ధాంతిక విభేదాలున్నా, సంక్షోభాలు, సమస్యలు తలెత్తినా మళ్లీ ప్రపంచయుద్ధ స్థాయిలో వినాశనానికి వెళ్లకుండా స్థూలంగా ఓ పద్ధతిలో దేశాలు నడవడానికి ఈ కట్టుబాట్లే దోహదం చేశాయి. కానీ, శాంతికి దారి చూపుతూ ఇతర దేశాలకు మార్గదర్శకంగా నిలవాల్సిన భద్రతామండలిలోని వీటో హక్కున్న దేశాలు పెడమార్గం పడుతుండటంతో కట్టుబాట్లు కాస్తా క్రమంగా పట్టు తప్పుతున్నాయి.

వలసవాద అవలక్షణాలు

క్రిమియాను 2014లో ఆక్రమించడం ద్వారా రష్యా తన విస్తరణకాంక్షను చాటుకుంది. అనంతరం మొదలైన యుద్ధం పేరుకే రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతోంది. నిజానికి ఇన్నాళ్లూ పోరు సాగింది రష్యా-అమెరికా సారథ్యంలోని నాటో (ఐరోపా) కూటమి మధ్యే అన్నది బహిరంగ రహస్యం! ఈ యుద్ధాన్ని ఎలా ఆపాలో ఇప్పుడు ఎవరికీ తెలియట్లేదు! అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ రాకతో పరిస్థితిలో మార్పు వస్తున్నా, యుద్ధం ఎలా ముగుస్తుందన్న స్పష్టత కొరవడింది. మూడేళ్లలో 25శాతం ఉక్రెయిన్ భూభాగం రష్యా ఆధీనంలోకి వెళ్లింది. కారణాలు ఏవైనా నాటో-రష్యా విస్త'రణ కాంక్ష'లు యావత్ ప్రపంచానికి ఆందోళన కలిగించే పరిణామాలే! రెండో ప్రపంచ యుద్ధానంతరం అమెరికా, సోవియట్ యూనియన్ ప్రచ్ఛన్న యుద్ధంలో రాజకీయంగా లాభపడిన చైనా చాపకిందనీరులా విస్తరించింది. అనేక దేశాలను వాణిజ్యపరంగా తన గుప్పిట పెట్టుకుని నయా వలసవాదాన్ని ఆవిష్కరిస్తోంది. డ్రాగన్ అప్పుల ఊబిలో చిక్కుకుని పలు దేశాలు విలవిల్లాడుతున్నాయి. తైవాన్‌పై పంజా విసిరేందుకు చైనా కాచుకు కూర్చుంది. తన చుట్టూ ఉన్న దేశాలన్నింటినీ భౌగోళిక వివాదాలతో బీజింగ్ ఇబ్బంది పెడుతోంది. మరోవైపు ఫ్రాన్స్, బ్రిటన్‌లు ఇప్పటికీ వలసవాద అవలక్షణాలను వదులుకోవడం లేదు. అనేక ఆఫ్రికా దేశాలతో ఫ్రాన్స్ కప్పం కట్టించుకుంటోంది. ఇప్పటికీ వారి అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోంది. వారి సహజ వనరులపైనా పెత్తనం చలాయిస్తోంది. అలనాటి రవి అస్తమించని సామ్రాజ్యం కూలినా- సమస్యల అగ్గిలో ఆజ్యం పోసేకుటిల యత్నాలను బ్రిటన్ మానుకోవడం లేదు. ఇజ్రాయెల్-పాలస్తీనా నుంచి కశ్మీర్ దాకా ప్రపంచంలో రావణకాష్ఠంలా రగులుతున్న అనేక సమస్యలకు బ్రిటనే కారణం!కమ్యూనిస్టు సోవియట్ యూనియన్‌తో 40 ఏళ్లపాటు ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగించిన అమెరికా- ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో అనేక దేశాల్లో తలదూరుస్తూ వస్తోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి సాధ్యమైనన్ని చిక్కుముళ్లు వేసిందీ అమెరికానే. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వ పతనం వెనక ఉన్నదీ అదే! ఇప్పుడు వాణిజ్య సుంకాల రూపంలో ట్రంప్ ప్రపంచాన్నే ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్లు నాడు సోవియట్‌ను కట్టడి చేయడానికి కమ్యూనిస్టు చైనాను అమెరికా దువ్వింది! ఇప్పుడు ఏకుమేకై కూర్చున్న చైనాకు ముకుతాడు వేయడానికి ట్రంప్ ఏకంగా సుంకాల యుద్ధానికి తెరలేపారు. మరోవైపు గ్రీన్‌లాండ్‌పైనా కన్నేశారు. ఇలా విస్తరణ కాంక్ష, ఆధిపత్య పోరు రూపంలో పాత అవలక్షణాలే అగ్రరాజ్యాల్లో కనిపిస్తున్నాయి. సుంకాల యుద్ధాలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, దేశాల మధ్య అపనమ్మకాలు, తీవ్రమవుతున్న ప్రజాస్వామ్య నియంతృత్వ ధోరణులు.. ఇలా ఎటు చూసినా అన్నీ అపశకునాలే! అలాగని మరో ప్రపంచయుద్ధాన్ని భరించే స్థితిలో మానవాళి లేదు. యుద్ధమంటూ వస్తే విజేతలుండరు. అంతా పరాజితులే!

దేనికి సంకేతం?

'సంక్లిష్ట సమయాలు బలమైన తరాన్ని తయారు చేస్తాయి. బలమైన మనుషులు మంచి రోజుల్ని ఆవిష్కరిస్తారు. మంచిరోజులు బలహీనులను సృష్టిస్తాయి. వారు సంక్లిష్ట సమయాలకు కారణమవుతారు!' అంటారు ప్రఖ్యాత అమెరికన్ రచయిత మైకెల్ హోఫ్! సమాజ జీవన చక్రాన్ని ప్రతిబింబించే ఈ మాటల్లో మనమిప్పుడు ఏ దశలో ఉన్నామన్నది ఎవరికి వారు సమాధానం చెప్పుకోవాల్సిన ప్రశ్న! దేశాల మధ్య ఆధిపత్య పోరు శ్రుతిమించినప్పుడల్లా ఏదో ఒక రకమైన నియమ నిబంధనలు, కట్టుబాట్లు మళ్లీ గాడిన పెడుతున్నాయి. ఆ పరిణతిని మానవాళి ప్రతిసారీ ప్రదర్శిస్తూనే ఉంది. అంతేకాదు, తీవ్రమైన సంక్షోభం సరికొత్త ప్రపంచ ఒరవడికి దారి తీసిందన్నది కూడా చరిత్ర చెబుతున్న సత్యం! నెపోలియన్ యుద్ధాల అనంతరం 1815-1914 మధ్య ఏర్పడ్డ కాన్సర్ట్ ఆఫ్ యూరప్ శాంతికి బాటలు వేసింది. గ్రేట్‌బ్రిటన్, ఆస్ట్రియా, రష్యా, ప్రష్యా, ఫ్రాన్స్‌లు కలిసి ఆధిపత్య పోరు కట్టుదాటకుండా దాదాపు వందేళ్లపాటు నెట్టుకొచ్చాయి. 1914లో మొదటి ప్రపంచ యుద్ధానంతరం స్వల్పకాలం పాటు నానాజాతి సమితి, రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఐక్యరాజ్య సమితి పుట్టుకొచ్చి అదే పాత్ర పోషించాయి. బహుశా 80 ఏళ్ల అనంతరం మళ్లీ మరో సరి కొత్త ప్రపంచ ఒరవడికి(వరల్డ్ ఆర్డర్)కు బీజాలు పడుతున్నాయేమో!

# ఉగ్రవాదుల ఏరివేతకు కాశ్మీర్‌ను జల్లెడ పట్టాలి !



జమ్ము కశ్మీర్: పర్యాటక స్వర్గధామం అయిన జమ్మూ కాశ్మీర్‌లో నరమేథం సృష్టించడం ద్వారా అక్కడ సాధారణ పరిస్థితులు రాకుండా...సామాన్య జనం అక్కడ లేకుండా..ముఖ్యంగా హిందువులను లేకుండా చేయాలన్న ముస్లిం ఉగ్రవాదుల కుట్రలో భాగమే తాజా నరమేధానికి నిదర్శనం. 370 ఆర్టికల్ రద్దు తరవాత కాశ్మీర్ అభివృద్ధి చెంది, పర్యాటకంగా పునరుత్తేజం పొందడాన్ని ఉగ్రవాదులు, వారికి సహకరిస్తున్న పాక్ జీర్ణించుకోవడం లేదు. ఈ దాడిని ముందే పసిగట్టడంలో కూడా భద్రతాబలగాలు విఫలం అయ్యారు. ఇకపోతే ఇదొక అనుభవంగా, గుణపాఠంగా కాశ్మీర్‌ను మొత్తం మిలిటరీకి అప్పగించాలి. శ్రీలంకలో ఈలం అన్నది లేకుండా చేసేందుకు సైనిక చర్య చేపట్టి విజయం సాధించారు. అనేక దేశాల్లో ఇలాంటి ఆపరేషన్లు జరిగాయి. ఇప్పుడు కాశ్మీర్‌లో జల్లెడ్ పట్టాలి. అణువణువు పరిశీలించాలి.. అక్కడి స్థానికులను రక్షిస్తూనే... కొత్తగా వస్తున్న వారిపై నిఘా పెంచాలి. జల్లెలడ పట్టాలి. లెఫ్ట్ తీవ్రవాదం కన్నా ఇస్లామిక్ తీవ్రవాదం చాలా ప్రమాదకరం. మావోయిస్టులను ఏరివేసే పనిని పక్కన పెట్టి కాశ్మీర్‌లో ఇస్లామిక్ తీవ్రవాదులను ఏరివేసే కార్యక్రమాలను ముమ్మరం చేయాలి. ఈ క్రమంలో పాక్‌తో సరిహద్దుల్లో భద్రత పటిష్టం చేయాలి. అలాగే ఆక్రమిత కాశ్మీర్‌లో నరమేథానికి శిక్షణ ఇస్తున్న శిబిరాలను లేపేయాలి. అవసరమైతే పాక్ ఆక్మిత కాశ్మీర్‌ను విలీనం చేసుకోవాలి. అందుకు కార్యాచరణ సిద్దం చేయాలి. భారత్ అంటే బలమేమిటో సత్తా చాటి పాక్‌కు గట్టిగా బుద్ది చెప్పాలి. మాటలతో పాక్ దారికి రాదు. దానికి గట్టిగా ఉద్ది చెప్పేందుకు సైనిక చర్యకు దిగాలి. 2008లో ముంబై దాడి తర్వాత సివిలియన్లపై జరిగిన రెండో అతిపెద్ద ఉగ్రదాడి ఇదే. జమ్మూ కాశ్మీర్ ప్రాంతం పాకిస్తానీ తీవ్రవాదులకు ఇంకా నిలయంగానే ఉందని ఈ సంఘటన చెపుతున్నది. ఉగ్రసంస్థ మతపరమైన లక్ష్యాలను సాధించడానికి లేదా ఒక నిర్దిష్ట మత సమూహానికి వ్యతిరేకంగా దాడులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం జరిగిన సంఘటన ఈ రకమైనదే. తహావూర్ హుస్సేన్ రాణాను అమెరికా భారత్‌కు అప్పగించిన తర్వాత దేశంలో ఉగ్రవాద చర్యలు జరిగే అవకాశం ఉందనే సమాచారం కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థ ముందుగానే తెలిపింది. అయితే, కేంద్రం, జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం సున్నిత పర్యాటక ప్రాంతమైన జమ్మూలో ముందుగానే కేంద్ర, రాష్ట్ర బలగాలను అప్రమత్తం చేయడంలో కొంత విఫలమైనట్టు ఒప్పుకోవాలి. ఇప్పటికైనా పర్యాటకులకు ఆటంకం లేకుండా నిరంతర గస్తీని పెంచాలి. బలగాలను ప్రతి గ్రామంలోనూ మొహరించాలి. ప్రపంచంలో ఇస్లామిక్ ఉగ్రవాదం భయంకరమైనదిగా నరరమేథం సృష్టిస్తోంది. దీనిని ప్రపంచ ముస్లింలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాలే చర్యలకు పూనుకోవాలి. జమ్మూకాశ్మీర్లో మతపరమైన లక్ష్యాలు సాధించేందుకు ఉగ్రదాడులు జరుగుతున్నాయి. ఇస్లామిక్ టెర్రరిస్ట్ గ్రూపులు అయిన లష్కర్ -ఏ -తోయిబా, జైష్ -ఏ - మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థలు ఈ దాడులు చేస్తున్నాయి. వీరిని ఏరివేసేందుకు ఎలాంటి మీనమేషాలు లెక్కించరాదు. ఎంత కఠినమైన పనయినా వీరిని కలుపు మొక్కల్లా ఏరిపారేయాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వానికి ఉగ్రవాదాన్ని అణచివేసే శక్తి లేకుపోవడం వల్ల కేంద్ర మిలిటరీ వ్యవస్థ జమ్మూకాశ్మీర్ ప్రాంతాన్ని తమ అధీనంలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. పాక్ తన కుయుక్తులను కేవలం ఉగ్రదాడులకే ఉపయోగిస్తోంది. పాక్‌ను ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మడం కాదు...దానిని అన్ని రకాలుగా నిర్వీర్యం చేయాలి. ఇప్పటికే అనేక మారణహోమాలు సాగాయి. ఇలాగే మిన్నకుంటే మరిన్ని దాడులు జరుగుతాయి. భారత్‌పై కన్నేస్తే అంతే సంగతులు అన్నట్లుగా పరిస్థితులు మారాలి. ఇజ్రాయిల్ తరహా శిక్షణతో సైన్యాన్ని రాటుదేలించాలి. పాక్‌ను ప్రపంచంతో వేరు చేసే అన్ని చర్యలు తీసుకోవాలి. అలాగే భారత్ నుంచి ఎలాంటి సాయం అందకుండా చూడాలి. ఈ క్రమంలో ఇలాంటి టెర్రరిస్టుల దాడులను తీవ్రంగా తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉంది. తాజా దాడిలో ప్రత్యేకంగా హిందూవర్గంవారిని గుర్తించి మరీ కాల్పులు జరపడం అందరూ ఆలోచించా ల్సిన విషయం. పహల్గాంలో జరిగిన సంఘటనలో బాధితుల ముందు తీవ్రవాదులు చేసిన వ్యాఖ్యలు అత్యంత అమానవీయమైనవి. దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు వారి వ్యాఖ్యల్లో కనిపిస్తున్నాయి. గత మూడేళ్లుగా కాశ్మీర్ పర్యాటక రంగం పుంజుకుంది. కాశ్మీరీలకు ఉపాధి అవకాశాలు బాగా పెరిగాయి. ఈ తీవ్రవాదులు చేసిన మతాధార మారణకాండ..పుంజుకుంటున్న కాశ్మీర్ ఆర్థిక పరిస్థితిని తిరిగి దెబ్బతీసే అవకాశం ఉంది. అలాగే కాశ్మీర్ పర్యాటక రంగం మళ్లీ దెబ్బతింటే, అది కాశ్మీరీల ఉపాధిపైన తీవ్రమైన ప్రభావం చూపనుంది. ఈ క్రమంలో కేంద్రం తీసుకున్న కొన్ని చర్యలు సమర్థనీయమైనవే. పాక్ పౌరులకు భారత్‌లోకి నో ఎంట్రీ సార్క్ వీసాలన్నీ రద్దుచేయడాన్ని స్వాగితించాల్సిందే. 28మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చడమే కాకుండా ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన వారు లేదా, ఆ దేశంతో సంబంధాలున్న స్థానిక ఉగ్రవాదులుగా నిర్ధారణ అయిన నేపథ్యంలో భారత్ ఈ దాడిని తీవ్రంగా పరిగణించింది. సౌదీ అరేబియా పర్యటనను అర్ధంతరంగా కుదించుకుని బుధవారం ఉదయం భారత్ తిరిగివచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ ఉదయంనుంచి కశ్మీర్‌లో పరిస్థితిపైన ఎడతెరిపి లేకుండా కేంద్రమంత్రులు, ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. సాయంత్రం ప్రధాని మోడీ అధ్యక్షతన అత్యవసరంగా సమావేశమైన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సంచలన నిర్ణయాలు తీసుకొంది. సార్క్ ఒడంబడికలో భాగంగా సభ్యదేశమైన పాకిస్థాన్ పౌరులకు జారీచేసిన వీసాలన్నిటినీ రద్దు చేస్తున్నట్లు, ఈ వీసాలున్న పాకిస్థాన్ పౌరులు 48గంటల్లోగా భారత్‌ను వదిలి వెళ్లాలని, ఆ దేశ పౌరులను దేశంలోకి అనుమతించేది లేదని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఇప్పటికే సరిహద్దు దాటిన పాక్ పౌరులు మే 1లోగా తిరిగి వెళ్లిపోవాలని ఆదేశించింది. అటారీ వాఘా వద్ద ఇరుదేశాల సరిహద్దుల్లో ఉన్న ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టునుసైతం తక్షణం మూసి వేయాలని నిర్ణయించింది. పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతును నిలిపివేసే దాకా సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపి వేయాలని కూడా సమావేశం నిర్ణయించింది. 1960లో ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం సింధు నదితో పాటుగా దాని ఉపనదుల ద్వారా పాక్‌లోని లక్షలాది ఎకరాలకు సాగు నీటితో పాటు పలు ప్రాంతాలకు తాగు నీరు లభిస్తుంది. మన దేశంలోని పాక్ దౌత్య కార్యాలయంలో ఉన్న రక్షణ లేదా, మిలిటరీ సలహాదారులను వెనక్కి పంపించి వేయాలని నిర్ణయించింది. అలాగే పాక్‌లోని మన దౌత్యకార్యాలయంలో ఉన్న ఈ సలహాదారులను కూడా వెనక్కి పిలిపిస్తారు. మే 1నుంచి మొత్తంమీద ఇరు దేశాల హైకమిషన్ కార్యాలయాల్లో సిబ్బందిని ఇప్పుడున్న 55నుంచి 30 కి కుదించాలని నిర్ణయించారు. ఇవ చేస్తూనే కాశ్మీర్‌ను మిలిటరీ కేంద్రంగా మార్చాలి. అక్కడ నిరంతర నిఘా పెంచాలి. ఉగ్రవాదుల ఏరివేతకు జల్లెడ పట్టాలి.

# కాశ్మీర్‌లో పర్యాటకంపై తీవ్ర దెబ్బ

శ్రీనగర్,పహల్గాంలో రెండు రోజుల క్రితం జరిగిన ఉగ్రవాదుల దాడి అక్కడి పర్యాటక పరిశ్రమను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. టూరిజమే ప్రధాన ఆదాయ వనరుగా బతుకుతున్న స్థానికులు తమ జీనాధారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. పర్యాటకులు రాక చిరు వ్యాపారులు, ఉపాధి లేక దుకాణాలు, హోటళ్లలో పనిచేసే చిరుద్యోగులు తాము బతికేదెలా అని ఆందోళన చెందుతున్నారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో రెండు రోజుల క్రితం జరిగిన ఉగ్రవాదుల దాడి అక్కడి పర్యాటక పరిశ్రమను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. టూరిజమే ప్రధాన ఆదాయ వనరుగా బతుకుతున్న స్థానికులు తమ జీనాధారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. పర్యాటకులు రాక చిరు వ్యాపారులు, ఉపాధి లేక దుకాణాలు, హోటళ్లలో పనిచేసే చిరుద్యోగులు తాము బతికేదెలా అని ఆందోళన చెందుతున్నారు. పహల్గాంలో పర్యాటక పరిశ్రమే స్థానికులకు బతుకుదెరువు. అక్కడి స్థానికుల్లో వివిధ దుకాణాల ద్వారా పర్యాటకులకు అవసరమైన వస్తువులను విక్రయిస్తూ కొందరు, హోటల్‌లు, రెస్టారెంట్‌ల ద్వారా పర్యాటకులకు భోజనం, బస సౌకర్యాలు కల్పిస్తూ మరి కొందరు జీవిస్తున్నారు. వారి దగ్గర వివిధ పనులు చేస్తూ పలువురు కూలీలు, కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఉగ్రవాదుల దాడితో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. పర్యాటకులంతా పహల్గాం నుంచి తిరిగి వెళ్లిపోయారు. పలువురు స్థానికులు కూడా సురక్షిత ప్రాంతాలకు తిరిగి వెళ్లారు. దాంతో అక్కడి దుకాణాలు, హోటళ్లు మూతపడ్డాయి. దాంతో పరిస్థితి ఇలాగే కొనసాగితే తాము బతికేదెలా అని వారు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితి తమకు గతంలో ఎన్నడూ ఎదురుకాలేదని అవేదన వ్యక్తంచేస్తున్నారు. కాగా, గత మంగళవారం మధ్యాహ్నం ఐదుగురు ముష్కరులు పర్యాటకులే లక్ష్యంగా నరమేధం సృష్టించారు. విహారయాత్రకు వచ్చిన మహిళలు, పిల్లలను విడిచిపెట్టి పురుషులను కాల్చిచంపారు. అనంతరం తాపీగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కాల్పుల్లో మొత్తం 28 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది.

# తెలంగాణలో ముదురుతున్న ఎండలు

హైదరాబాద్, తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంది. చాలా జిల్లాల్లో రాత్రిపూట వేడి వాతావరణం మరింత ఎక్కువగా ఉండనుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్ర, శనివారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే వీలుందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.

# కారు స్టీరింగ్ చేతులు మారుతుందా?



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) మరో మూడు రోజుల్లో ( ఏప్రిల్ 27) ఇరవై నాలుగేళ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకుని రజతోత్సవ సంవత్సరంలోకి అడుగు పెడుతోంది. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో రజతోత్సవ సభను ఘనంగా జరుపుకునేందుకు సిద్దమవుతోంది. ఒక విధంగా ఇదొక అపూర్వ సందర్భం. అవును పాతికేళ్ళ క్రితం, 2001 ఏప్రిల్ 2న జలదృశ్యం (కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం) లో పురుడు పోసుకున్నటీఆర్ఎస్ ఇంత కాలం బతికి బట్టకడుతుందని ఎవరూ ఊహించి ఉండరు. ముఖ్యంగా అప్పటికే ప్రత్యేక తెలంగాణ నినాదంతో పుట్టి గిట్టిన పార్టీలు అనేకం ఉన్న నేపథ్యంలో టీఆర్ఎస్ కూడా అంతే అనుకున్నవారు, అన్నవారు కూడా ఉన్నారు. అయితే, తెలంగాణ సెంటిమెంట్ తో పుట్టిన టీఆర్ఎస్ విజయవంతంగా, రాష్ట్రాన్ని సాధించుకోవడమే కాకుండా.. పాతికేళ్ళ ప్రస్థానం పూర్తి చేసుకుంది. రాష్ట్రాన్ని పదేళ్ళు పాలించింది. ప్రతిపక్ష అనుభవాన్నీ రుచి చూసింది. నిజానికి, తెలుగు నాట అనేక పార్టీలు మఖలో పుట్టి పుబ్బలో పోయాయి. అప్పుడే కాదు.. ఇప్పటికి కూడా, పాతికేళ్ళు బతికి బట్ట కట్టిన పార్టీలు రెండే రెండున్నాయి. 1982 లో నందమూరి తారక రామ రావు స్థాపించిన తెలుగు దేశం పార్టీ తర్వాత రజతోత్సవం జరుపుకుంటున్న పార్టీ, టీఆర్ఎస్ మాత్రమే బతికి బట్ట కట్టిన పార్టీగా చరిత్ర పుటల్లో నిలిచింది. ఈ పాతికేళ్ళలో పార్టీలో చాలా మార్పులు జరిగాయి. 2001లో ఉద్యమ పార్టీగా పుట్టిన టీఆర్ఎస్, 2014లో ఫక్తు రాజకీయ పార్టీగా రూపాంతరం చెందింది. ఆ తర్వాత 2022లో భారత రాష్ట్ర సమితిగా(బీఆర్ఎస్) గా పేరు మార్చుకుని జాతీయ రాజకీయాల్లో కాలు పెట్టింది. అయితే ఉద్యమ పార్టీ రాజకీయ పార్టీగా, ప్రాతీయ పార్టీ, జాతీయ పార్టీగా రూపాంతరం చెందినా, అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో కూర్చున్నా పార్టీ పగ్గాలు మాత్రం చేతులు మారలేదు. వ్యవస్థాపక అధ్యక్షుడు, కల్వకుట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) సారథ్యకలోనే ఇప్పటికీ పార్టీ నడుస్తోంది. ఆయనే పార్టీ అధ్యక్షుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా డ్యూయల్ రోల్ ప్లే చేస్తున్నారు. రెండు పదవుల్లో కొనసాగుతున్నారు. నిజానికి,ముందు ముందు కూడా ఆయనే కొనసాగుతారు. అందులో అనుమానం లేదు. అయితే పదవి ఆయనదే అయినా.. పెత్తనం అయన చేతుల్లో ఎంతవరకూ ఉంటుంది అనేది అనుమానమే అంటున్నారు. ఇప్పటికే చాలావరకు ఫార్మ్ హౌస్ కు పరిమితమైన కేసీఆర్ తిరిగి క్రియాశీల నేతగా జనంలోకి వస్తారా? ముందుండి పార్టీని నడిపిస్తారా? తెర వెనక నుంచి మార్గ 'దర్శకత్వం' మాత్రమే చేస్తారా? అంటే.. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నట్లే అన్న సంకేతాలు స్పష్టంగా వస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా పార్టీ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని, పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వివిధ టీవీ చానల్స్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలను జాగ్రత్తగా గమినిస్తే.. ఏదో ఇలాంటి, ఉత్సవాల్లో దర్శనం ఇవ్వడం వరకే కేసీఆర్ పాత్ర పరిమితం కాబోతోందననే సంకేతాలు కనిపిస్తున్నాయని అంటున్నారు.నిజానికి.. కారాణాలు ఏమైనా ఇప్పటికే పార్టీలో కేసీఆర్ పాత్ర చాలా వరకూ కుదించుకు పోయింది. ఇందులో దాపరికం లేదని పార్టీ నాయకులు అంగీకరిస్తున్నారు. మరోవంక కేటీఆర్ అప్రకటిత ఉత్తరాధికారిగా సర్వం తానై చక్రం తిప్పుతున్నారనేది కళ్ళ ముందున్న సత్యం. అదలా ఉంటే గడచిన రెండుమూడు రోజుల్లో కేటీఆర్ వేర్వేరు టీవీ చాన్నాళ్ళకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో కేసీఆర్ ఫ్యూచర్ రోల్ పై మరింత క్లారిటీ ఇచ్చారని అంటున్నారు. కేసీఆర్ పార్టీ అధ్యక్షుడిగా ఉంటారు. కానీ, పార్టీ రోజువారీ రాజకీయ కార్యకలాపాల్లో కనిపించరు. వినిపించరు. పార్టీ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనరు. తెర వెనక నుంచి మార్గ దర్శకత్వం మాత్రమే చేస్తారు. తెరపై కనిపించే రోజువారీ రాజకీయ కార్యకలాపాలన్నీ కేటీఆర్ చూసుకుంటారు. అలాగే, ప్రతిపక్ష నేతగానూ కేసీఆర్ కొనసాగుతారు, కానీ, అసెంబ్లీకి మాత్రం రారని, కేటీఆర్ ఒకటి రెండు ఇంటర్వ్యూలలో స్పష్టంగానే చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు చేసే అవమానాలను భరించవసిన అవసరం కేసీఆర్ కు లేదని, అందుకే ఆయన, అసెంబ్లీకి రారని స్పష్టం చేశారు. అంతేకాదు.. గతంలో తమిళనాడులో జయలలిత, ఏపీలో చంద్రబాబు నాయుడు, అధికార పక్షం అవమానాలను భరించలేక సంవత్సరాల తరబడి అసెంబ్లీకి రాలేదని, అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు కేసీఆర్ కూడా అసెంబ్లీ ముఖం చూడరని కేటీఆర్ స్పష్టం చేశారు. సో.. ఇక గులాబే బాస్ ఎవరంటే.. తెర వెంక కేసీఆర్, తెరపై కేటీఆర్ ఆర్ అంటున్నారు.

## ఎన్నికల కేసు కొట్టివేతకు రేవంత్ పిటిషన్

హైదరాబాద్,తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. గతేడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై భాజపా నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. భాజపాకు పరువు నష్టం కలిగేలా రేవంత్ రెడ్డి మాట్లాడారంటూ ఫిర్యాదు చేశారు. కాసం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు.. విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది. భాజపా మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పారని కాసం తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రసంగం ఆడియో, వీడియో క్లిప్పింగ్‌లను సైతం కాసం కోర్టుకు సమర్పించారు.

# అజ్ఞానం..అజ్ఞాతం.. మళ్లీ ప్రత్యక్షం..

నెల్లూరు:అనీల్ కుమార్ యాదవ్.. పరిచయం అక్కర్లేని పేరు. జగన్ హయాంలో ఒళ్లూపై తెలియకుండా మాట్లాడి, తొడకొట్టి సవాళ్లు విసిరి పాపులర్ అయ్యారు. ప్రత్యర్థులపై నోరెట్టుకుని పడిపోవడమే రాజకీయం అన్నట్లుగా అప్పట్లో ఆయన వ్యవహార శైలి ఉండేది. ఆ తీరు కారణంగానే జగన్ కు దగ్గరయ్యారనీ చెబుతుంటారు. సరే అది పక్కన పెడితే వైసీపీ ఘోర పరాజయం తరువాత అనిల్ కుమార్ యాదవ్ ఎక్కడా కనిపించలేదు. వినిపించలేదు. మౌనంగా మాయమైపోయారు. వైసీపీ అధికారంలో ఉండగా కన్నూమిన్నూ గానక ఇష్టారీతిగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు పైనోరెట్టుకు పడిపోయిన అనీల్ కుమార్ యాదవ్ ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. వినిపించడం లేదు. పోలింగ్ జరిగిన తరువాత ఒక సారి మీడియా ముందుకు వచ్చి పోలీసులు, అధికారులు ఏకపక్షంగా తెలుగుదేశం కూటమికి అనుకూలంగా వ్యవహరించారని ఓ ఆరోపణ చేసి ఫలితాలకు ముందే ఓటమి అంగీకరి ంచేశారు. ఆ తరువాత ఆయన ఇక ఎక్కడా బయటకు వచ్చిన దాఖలాలు లేవు. అయితే పార్టీ అధికారంలో ఉండగా, తాను మంత్రిపదవి వెలగబెడుతున్న సమయంలో అనీల్ కుమార్ యాదవ్ నెల్లూరు జిల్లా లో సాగించిన దోపిడీ పర్వం అంతా ఇంతా కాదు.నెల్లూరు జిల్లాలో ఖనిజాల దోపిడీ సహా అనేక అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతే కాదు జిల్లాకు చెందిన సీనియర్ నేతలు ఆనం రామనాయారణరెడ్డి, కొటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వంటి వారు వైసీపీ తీరుతో, జగన్ విధానాలతో విభేదించి బయటకు వచ్చి తెలుగుదేశం గూటికి చేరారు. వారిని అనీల్ కుమార్ యాదవ్ అనుచితంగా దూషించి వారి రాజకీయ జీవితం ముగిసిపోయందని చెప్పారు. ఒక వేళ వారు రాజకీయాలలో రాణిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానంటూ సవాళ్లు సైతం విసిరారు. ఇప్పుడు తన రాజకీయ జీవితమే సందిగ్ధంలో పడిన నేపథ్యంలో ముఖం చూపలేక చాటేశారు. విపక్షంలో ఉన్న సమయంలోనే తెలుగుదేశం పార్టీ అనీల్ కుమార్ యాదవ్ అక్రమాలపై జ్యుడీషియల్ విచారణకు డిమాండ్ చేసింది. ఇప్పుడు అధకారంలోకి రాగానే విచారణకు ఆదేశించే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి. ఇలా ఎలా చూసినా చిక్కుల సుడిగుండంలో చిక్కుకున్న అనీల్ కుమార్ యాదవ్ ఏ కలుగులో దాక్కొన్నా బయటకు లాక్కొచ్చి చట్టం ముందు నిలబెట్టడానికి తెలుగుదేశం శ్రేణులు సిద్ధంగా ఉన్నాయి. దీంతో తనను తాను కాపాడుకోవడం ఎలాగో తెలియక అనిల్ కుమార్ యాదవ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించలేదు. దీంతో ఆయన పార్టీ మారే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే అధికారంలో ఉన్న సమయంలో స్థాయి మరిచి.. ఇష్టారీతిగా తెలుగుదేశం, జనసేన అధినాయకులపై అనిల్ కుమార్ చేసిన అనుచిత విమర్శలు, వ్యాఖ్యల కారణంగా ఆ రెండు పార్టీలలోనూ అవకాశం లేకపోయింది. దీంతో అనివార్యంగా ఆయన ఇటు వైసీపీకి దూరమై, అటు మరో పార్టీ అండ లేకుంటే కేసులను తట్టుకోవడం సాధ్యం కాదని భావించి గత్యంతరం లేని పరిస్థితుల్లో మళ్లీ జగన్ పంచన చేరి పబ్బం గడుపుకోవాలన్న నిర్ణయానికి వచ్చారని పరిశీలకులు అంటున్నారు. అందుకు ఉదాహరణగా నిన్న తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశానికి అనిల్ కుమార్ యాదవ్ హాజరు కావడాన్ని చూపుతున్నారు. మొత్తం మీద అజ్ఞానం నుంచి అజ్ఞాతంలోకి అక్కడ నుంచి మళ్లీ జగన్ పంచకు చేరిన అనిల్ కుమార్ ప్రస్తతం తన భవిష్యత్ ఏమిటన్న అయోమయంలో ఉన్నట్లుగా కనిపిస్తోందని అంటున్నారు.

## పార్టీ పదవుల్లో సీనియర్లకే పెద్దపీట

హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ పదవుల్లో సీనియర్లకు పెద్ద పీట వేయనున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో బుధవారంగాంధీభవన్ లో పీసీసీ అబ్జర్వర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 70 మంది అబ్జర్వర్లను ఆహ్వానించగా.. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితోపాటు మరో ఐదుగురు రాలేదు. దీంతో వారిని ఆ పదవి నుంచి తొలగించారు. అదే విధంగా మీటింగ్ కు ఆలస్యంగా వచ్చిన వారిపైనా వేటు- పడింది. 2017 నుంచి పార్టీలో ఉన్న వారికే పదవులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. మండల, బ్లాక్ అధ్యక్షుల నియామకం కోసం జిల్లాకు ఇద్దరు అబ్జర్వర్లను నియమిస్తున్నట్టు కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. ప్రతి మండలం నుంచి పార్టీ మండలాధ్యక్ష పదవి కోసం ఐదుగురి పేర్లను పంపాలని సూచించారు. అదే విధంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం మూడు పేర్లను పీసీసీకి పంపాలని అబ్జర్వర్లకు మీనాక్షి నటరాజన్ సూచించారు. పార్టీ నాయకత్వంలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి చాలా చరిత్ర ఉందని, బ్రిటీష్ వాళ్లతో పోరాటం చేసిందని అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని, జాతీయ స్థాయి ఆలోచనలతోనే ముందుకు పోతుందని అన్నారు. గాంధీ సిద్ధాంతాలతోనే పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు. పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలని అన్నారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని గుజరాత్ మోడల్ గా చేపట్టాలని అధినాయకత్వం నిర్ణయించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను విస్తారంగా జనంలోకి పోవాలని అన్నారు. సిద్ధాంత పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటి సారిగా తెలంగాణ లో కులగణన, 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మకమని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను మనం ప్రజల్లోకి విస్తృతంగా తీస్కెళ్లాలని అన్నారు. ఏప్రిల్ 25 నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు జరగనున్నాయని ప్రకటించింది. ఈ సందర్భంగా ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ జాతీయ పార్టీ జాతీయ స్థాయి ఆలోచనతో పార్టీ పని చేస్తుంది.. పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలి అని సూచనలు చేసింది. ఈ విషయంలో పార్టీ నాయకత్వం చాలా చిత్తశుద్ధితో సీరియస్ గా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ దేశంలోనే మొదటి సరిగా తెలంగాణలో కుల గణన చేసి 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మక నిర్ణయం అన్నారు. అలాగే, దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని.. అయితే, దేశంలో మోడీ సర్కార్, గత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మన ప్రభుత్వం చేపట్టింది.. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను మనం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి అని మీనాక్షి నజరాజన్ పేర్కొన్నారు.

## లష్కరే తోయిబాకు కొత్త ముసుగు

శ్రీనగర్,పహల్గాంలోని బైసరన్‌లో ఉగ్రదాడి చేసి పర్యాటకులను పొట్టనబెట్టుకున్న 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్)' కొత్తగా ఏర్పాటైందే. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఈ సంస్థ ఏర్పడింది. తొలుత ఆన్‌లైన్‌లో ఉగ్ర కార్యకలాపాలను నిర్వహించేది. ఆ తరువాత 6 నెలల్లోగా లష్కరే తోయిబా వంటి పలు ఉగ్ర సంస్థల సభ్యులను తీసుకుని భౌతిక గ్రూపుగా ఏర్పాటైంది. దీని వెనుక పాకిస్థాన్ హస్తం ఉంది. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్‌ఐనే టీఆర్‌ఎఫ్‌ను సృష్టించిందని నిఘా వర్గాల సమాచారం. లష్కరే తోయిబా నుంచి ప్రపంచం దృష్టిని మళ్లించడానికి ఈ టీఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేయించినట్లు చెబుతున్నారు. లష్కరే తోయిబా ఉగ్ర కార్యకలాపాల కారణంగా 2018లో నిషేధిత దేశాల జాబితాలో పాకిస్థాన్‌ను ఆర్థిక చర్యల టాస్క్‌ఫోర్స్ చేర్చింది. దీంతో పాక్ దిద్దుబాటు- చర్యల్లో భాగంగా టీఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేయించిందనన్న అనుమానాలు ఉన్నాయి. 2019లో ఏర్పాటైనప్పటి నుంచి టీఆర్‌ఎఫ్ దాడులకు దిగుతోంది. కశ్మీర్ ప్రాంతంలో ఉనికిని చాటుకోవాలని ప్రయత్నిస్తోంది. దీంతో 2023లో టీఆర్‌ఎఫ్‌ను ఉగ్రసంస్థల జాబితాలో భారత్ చేర్చింది. టీఆర్‌ఎఫ్‌ను సృష్టించింది షేక్ సజ్జాద్ గుల్ అలియాస్ షేక్ సజ్జాద్. అతడు కశ్మీరీ మిలిటెంటు-. శ్రీనగర్‌లో ప్రముఖ జర్నలిస్టు అయిన షుజాత్ బుఖారీ, అతడి భద్రతా సిబ్బంది ఇద్దరిని 2018 జూన్ 14వ తేదీన హతమార్చడానికి కుట్ర పన్నింది సజ్జాదే. ఉగ్ర కార్యకలాపాల కారణంగా ఉపా చట్టం కింద సజ్జాద్‌ను ఉగ్రవాదిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గతంలో అతడు లష్కరే తయ్యిబా కమాండర్‌గా పని చేశాడు. టీఆర్‌ఎఫ్‌లో పనిచేసే వారిలో సాజిద్ జాట్, సలీం రెహ్మానీ ఉన్నారు. వీరిద్దరూ గతంలో లష్కరేలో పనిచేసిన వారే. అన్ని మతాలకు చెందిన వ్యక్తులను టీఆర్‌ఎఫ్ లక్ష్యంగా చేసుకుంటుంది. ఆ సంస్థ దాడులు చేసిన వారిలో కశ్మీరీ పండిట్లు, సిక్కులు, హిందువులు, ముస్లింలు ఉన్నారు. 2020 ఏప్రిల్ 1న నియంత్రణ రేఖ వెంబడి కుప్వారాలోని కేరన్ సెక్టార్‌లో నాలుగు రోజులపాటు- ఎదురు కాల్పులు జరిగినప్పుడు తొలిసారిగా టీఆర్‌ఎఫ్ పేరు వెలుగులోకి వచ్చింది. అక్టోబరు 30న దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాంలో ముగ్గురు భాజపా కార్యకర్తలను టీఆర్‌ఎఫ్ ఉగ్రవాదులు హతమార్చారు. నవంబరు 26న శ్రీనగర్‌కు సమీపంలోని లాయేపోరా ప్రాంతంలో 2 రాష్ట్రీయ రైఫిల్స్‌పై దాడి చేసిన టీఆర్‌ఎఫ్ ఉగ్రవాదులు దానిని చిత్రీకరించారు. ఇద్దరు సైనికులకు కాల్చి చంపారు. 2023 ఫిబ్రవరి 26న పుల్వామాలో సంజయ్ శర్మ అనే కశ్మీరీ పండిట్‌ను టీఆర్‌ఎఫ్ ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. 2024 అక్టోబరు 20న గండేర్‌బల్‌లోని సోన్‌మార్గ్‌లో ఒక వైద్యుడు, ఆరుగురు వలస కార్మికులను ఉగ్రవాదులు హతమార్చారు. తమ గురించి చర్చించుకోవాలని, తాము బలంగా ఉన్నామని చెప్పుకోవడానికి ఈ ఉగ్రమూక పనిచేస్తోంది. తాజా మారణహోమం కూడా ఇందులో భాగమే.

## గోదావరి -బనకచర్లను ఆపండి

హైదరాబాద్,గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ లేఖ రాసింది. గోదావరి - బనకచర్ల లింక్ విషయంలో ఏపీ ముందుకెళ్లకుండా చూడాలని లేఖలో పేర్కొంది. ఎలాంటి అనుమతుల్లేకుండా ప్రాజెక్టు చేపడుతున్నారని గతంలో తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపామని ఈఎన్సీ వెల్లడించింది. పనులు విభజన చట్టం, -ట్రైబ్యునల్ అవార్డులకు విరుద్ధమని... తెలంగాణకు నష్టం జరుగుతుందన్న ఈఎన్సీ తెలిపింది. ఈ నెల ఏడో తేదీన జరిగిన జీఆర్ఎంబీ సమావేశంలోనూ ఈ అంశాన్ని ప్రస్తావించామంది. ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆ రోజు జీఆర్ఎంబీ ఛైర్మన్, ఏపీ సభ్యులు సమాధానం ఇచ్చారని తెలిపింది. కానీ, మరుసటి రోజే గోదావరి - బనకచర్ల లింక్ కోసం ఏపీ ప్రభుత్వం జలహారతి కార్పోరేషన్ ఏర్పాటు- చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలంగాణ ఈఎన్సీ పేర్కొంది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించి ఏపీని నిలువరించాలి. పోలవరం ప్రాజెక్టు, తాడిపూడి ఎత్తిపోతల పథకాలపై ఇందుకు సంబంధించిన ఎలాంటి టెండర్ల పక్రియ చేపట్టవద్దు. కృష్ణా జలాలకు సంబంధించి -ట్రైబ్యునల్ లో వాదనలు జరుగుతుండగా... జలాల మళ్లింపు

# టీడీపీకి తలనొప్పిగా అన్నమయ్య జిల్లా?



అన్నమయ్య జిల్లా : అన్నమయ్య జిల్లా తెలుగుదేశం పార్టీలో కుమ్ములాటలు రోజుకో మలుపు తిరుగుతూ తమ్ముళ్లను టెన్షన్ పెడుతున్నాయంట. ఏకంగా ఇన్చార్జ్ మంత్రి సమక్షంలో గొడవలు, పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్‌ను మార్చాలన్న సిగపట్లతో ఆయా సెగ్మెంట్లలో వర్గ రాజకీయం ఎవరికీ అంతుపట్టకుండా తయారైందంట.. ఆ క్రమంలో అసలు పార్టీలో ఎవ్వరున్నారో తెలియని స్థితి నెలకొందని క్యాడర్ దిక్కులు చూడాల్సి వస్తోందంట.. కీలక నియోజకవర్గాలలో నాయకులు తమను పట్టించుకోవడం లేదని కార్యకర్తలు వాపోతుండటంతో.. రాజంపేట పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో పార్టీ పరిస్థితి నానాటికి తీసికట్టుగా మారిందనే ప్రచారం జరుగుతోంది.. అసలు అన్నమయ్య జిల్లా టీడీపీలో ఏం జరుగుతుంది?.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ పరిస్థితి ఎందుకు తలెత్తుతోంది?

అన్నమయ్య జిల్లాలో పాగా వేసిన టీడీపీ

రాజంపేట పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గాన్ని తప్పించి మిగతా అరు అసెంబ్లీ నియోజకవర్గాలతో గతంలో అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేసింది వైసిపి ప్రభుత్వం.. అప్పట్లో వైసీపీకి మంచి పట్టున్న ఆ కొత్త జిల్లాల్లో గత ఎన్నికల్లో టిడిపి పాగా వేయగలిగింది. అరు నియోజకవర్గాల్లో రాజంపేట, తంబళ్లపల్లి మినహా మిగతా నాలుగు అయిన రైల్వే కోడూరు, రాయచోటి, పీలేరు, మదనపల్లి నియోజకవర్గాలలో టీడీపీ విజయం సాధించింది. మిగతా రెండు చోట్ల కూడా గెలవాల్సిన పరిస్థితులు ఉన్నప్పటికీ అభ్యర్థుల ఎంపికలో అయోమయంతో పాటు అప్పటి వరకు ఇన్చార్జులుగా వ్యవహరించిన పార్టీ నేతల సహకారం కొత్త అభ్యర్థులకు లభించకపోవడంతో ఓటమి పాలయిందన్న ప్రచారం ఉంది.

పీలేరులో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కూమార్‌రెడ్డి చెప్పిందే వేదం

అయితే ఒక్క పీలేరులో తప్ప మిగతా అన్ని చోట్ల టీడీపీ గ్రూపులతో కొట్టుమిట్టాడుతోంది. పీలేరులో ఏక వ్యక్తి నాయకత్వం అవ్వడం, అక్కడి ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తమ్ముడు నల్లారి కిషోర్‌కూమార్‌రెడ్డి గ్రూపులను ఎంటర్‌టెయిన్ చేయకపోవడంతో పాటు, ఆయన క్యాడర్‌తో నేరుగా సత్సంబంధాలు కలిగి ఉంటడంతో అక్కడ గ్రూపుల గోల కనిపించడం లేదంట.. ముందు నుంచి పీలేరు నల్లారి కుటుంబం ఇలాకా కావడంతో పార్టీలో కిషోర్‌కుమార్‌రెడ్డి చెప్పిందే వేదంగా నడుస్తోందంటున్నారు

అత్యంత వివాదాస్పదంగా మారిన తంబళ్లపల్లె నియోజకవర్గం

జిల్లాలో అత్యంత వివాదాస్పదంగా మారిన నియోజకవర్గం తంబళ్లపల్లి. అక్కడ గత ఎన్నికలలో పోటీ చేసి పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి చేతిలో పరాజయం పాలైన టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డిని మరో వర్గం తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తుంది. ఎన్నికలు ముగిసిన పది నెలలు అయినప్పటికీ ప్రతిరోజు ఎక్కడో ఏదో ఒక చోట తెలుగు తమ్ముళ్ల మధ్య వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తంబళ్లపల్లి టీడీపీ ఇన్చార్జ్‌గా జయచంద్రారెడ్డిని తప్పించాలని మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ వర్గం గట్టిగా పోరాటం చేస్తోంది. దానికి తోడు జయచంద్రారెడ్డి సైతం వైసీపీ వారిని ప్రోత్సాహిస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

2014 ఎన్నికల్లో తంబళ్లపల్లెలో విజయం సాధించిన శంకర్‌యాదవ్

2014 ఎన్నికలలో పడమటి మండలాలలో మొత్తం అన్నిచోట్ల ఓటమి పాలయితే తంబల్లపల్లిలో మాత్రం టీడీపీ పార్టీ విజయం సాధించింది. శంకర్‌యాదవ్ టీడీపీ నుంచి గెలిచారు. అయితే తాజాగా జరిగిన 2024 ఎన్నికలలో జయచంద్రరెడ్డి కోవర్డు రాజకీయం చేసారని అందుకే అక్కడ ఓటమి పాలయ్యాయమని అతని వ్యతిరేక వర్గం అరోపిస్తుంది. తర్వాత జయచంద్రారెడ్డి అంగల్లలో చంద్రబాబుపై రాళ్ల దాడి చేసిన వారిని సైతం పార్టీలో చేర్చుకున్నారని అంటున్నారు. తాజాగా హార్సిలీ హిల్స్ ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి రివ్యూ చేయాలని ప్రయత్నించగా అయన ఎదురుగా రెండు వర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి. తీవ్రస్థాయిలో బూతులు తిట్టుకుంటూ కలపడ్డారు. దాంతో బీసీ జనార్ధన్‌రెడ్డితో పాటు పార్టీ సమన్వయ కర్త దీపక్ రెడ్డి, పార్టీ అబ్జర్వర్ అయిన గురవారెడ్డి అక్కడ నుంచి వెళ్ళిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

2019లో పోటీ చేసి ఓడిపోయిన బత్యాల చెంగల్రాయుడు

రాజంపేట అసెంబ్లీలోనూ అదే పరిస్థితి. అక్కడ బత్యాల చెంగల్రాయుడు ఎన్నికల ముందు వరకు టీడీపీ ఇన్చార్జ్‌గా ఉన్నారు. 2019లో అయన పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే 2024 ఎన్నికల్లో అనుహ్యంగా సుగవాసి సుబ్రమణ్యంకు టీడీపీ టికెట్ ఇచ్చారు. ఎంపి అభ్యర్థిగా అప్పటి వరకు ఫోకస్ అయిన సుబ్రమణ్యాన్ని ఎమ్మెల్యే అభ్యర్థిగా మార్చారు. రాజంపేట ఎంపీ అభ్యర్థిగా బీజేపీ నుంచి మాజీ సీఎం కిరణ్ కూమార్‌రెడ్డిని బరిలో దింపడంతో గత్యంతరం లేక సుగవాసి సుబ్రమణ్యం రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యారు.

6వేల ఓట్ల తేడాతో పరాజయం పాలైన సుబ్రమణ్యం

సుబ్రహ్మణ్యం గెలుపు కోసం రాజంపేట టీడీపీ క్యాడర్ బలంగా పనిచేసినప్పటికి నాయకుల వెన్ను పోటు కారణంగా 6వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారన్న ప్రచారం ఉంది. ప్రస్తుతం జిల్లా పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు వర్సెస్ సుబ్రమణ్యం మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. సుబ్రమణ్యాన్ని ఇన్ చార్జ్ పదవి నుంచి తప్పించి రాజు కివ్వాలని కొందరు.. మరి కొందరు మేడా మల్లిఖార్జునరెడ్డిని పార్టీలోకి తీసుకు రావాలని ప్రయత్నాలు చేస్తున్నారు. దాంతో ఇక్కడ కూడా ఇన్చార్జ్ మంత్రి రివ్యూ సందర్భంగా గొడవ జరిగింది.

మదనపల్లి టీడీపీలో మూడు ముక్కలాట

రాయచోటిలో సైతం మంత్రి రాంప్రసాద్ రెడ్డి తమను పట్టించుకోకుండా వైసీపీ వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని టిడిపి క్యాడర్ బహిరంగంగా అరోపణలు గుప్పిస్తుంది. మదనపల్లి నియోజకవర్గం టీడీపీలో సైతం మూడు గ్రూపులు అరు తగదాలు అన్నట్లు తయారైంది పరిస్థితి. ఎమ్మెల్యే షాజహాన్‌దో వర్గం, మాజీ ఎమ్మెల్యే రమేశ్ దో వర్గం. ఇక మూడోది తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు వర్గం. ఆ క్రమంలో మదనపల్లి టీడీపీలో మూడు ముక్కలాట నడుస్తూ అన్ని వర్గాలు నిత్యం సిగపట్లకు దిగుతున్నాయి

రైల్వే కోడూరు జనసేన నుంచి గెలిచిన అరవ శ్రీధర్

రైల్వే కోడూరు నియోజక వర్గంలో కూడా తాజాగా జరిగిన రివ్యూ సమావేశం గందరగోళంగా మారిపోయింది. కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ జనసేన నుంచి గెలిచారు. ఆయన టీడీపీ ఇన్చార్జ్ అయిన రూపానందరెడ్డి వర్గీయుడు అన్న ముద్ర ఉంది. ఇంతకు ముందు రైల్వేకోడూరు ఇన్చార్జిగా ఉన్న విశ్వనాథ్‌నాయుడితో వారికి పొసగడం లేదంట. ఈ నేపధ్యంలో ఇన్చార్జి మంత్రి అయిన బిసి జనార్ధన్ రెడ్డి సమక్షంలో జరిగిన రివ్యూ రసాభసగా ముగిసింది. నేను డబ్బులు పెట్టాను.. నేను చెప్పిందే జరగాలని రూపానందరెడ్డి బావిస్తున్నాడని టీడీపీ క్యాడర్ అంటోంది.

సమన్వయ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్న క్యాడర్

వైసిపి నుంచి వచ్చిన రూపానందరెడ్డి వారికి పెద్దపీట వేస్తున్నాడని అంటున్నారు. ఎమ్మెల్యే శ్రీధర్ సైతం రూపానందరెడ్డి వర్గం కావడంతో ఇక్కడ పెత్తనం అంతా అయనదే నంటున్నారు. అందుకే అక్కడ టీడీపీకి సంబంధించి సమన్వయ కమిటీ వేయాలని క్యాడర్ డిమాండ్ చేస్తోంది. మొత్తం మీద అక్కడ నేతల ఆధిపత్యం పోరుతో పార్టీ అవిర్భావం నుంచి ఉన క్యాడర్ అయెమయంలో పడుతోంది

అధికారులు తమ ఇష్టానుసారం వ్యవహారిస్తున్నారని ఆరోపణలు

జిల్లా వ్యాప్తంగా పార్టీ నేతల విభేదాలతో క్యాడర్‌ను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దానికి తోడు జిల్లా మంత్రి వైఖరి కారణంగా అధికారులు సైతం తమ ఇష్టానుసారం వ్యవహారిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి స్థితిలో జిల్లా పార్టీ నాయకులు పార్టీ పటిష్టతకు కృషి చేయాల్సింది పోయి.. ఎవరికి వారు తమ గ్రూపులను ప్రోత్సాహిస్తున్నారని అంటున్నారు. అక్కడ మారుతున్న ఈక్వేషన్లతో అన్నమయ్య జిల్లాలో నువ్వు పాత టిడిపి వాడివా అయితే నీతో పనిలేదు.. నువ్వు కొత్త టిడిపి అయితే మాతో ఉండు అని నాయకులు అంటున్నారంట.. మొత్తానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇలాగా లాంటి అన్నమయ్య జిల్లాలో అలా తయారైంది టీడీపీ పరిస్థితి.

# భారత్ పాక్ మధ్య యుద్ధ మేఘాలు !



జమ్మూకశ్మీర్ లో పహల్గామ్ ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ద మేఘాలు అలుముకుంటున్నాయి. ఉగ్రదాడి ఘటన అనంతరం పాకిస్తాన్ మిలటరీ అధికారులు భారత్ సరిహద్దుల వెంట భారీగా సైన్యాన్ని మోహరిస్తున్నారు. కరాచీ నుంచి లాహోర్, రావల్పిండి కి యుద్ధ విమానాలను తరలించింది. పాక్ కవ్వింపు చర్యలతో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు రేగుతున్నాయి. భారత్ నుంచి కూడా భద్రతా బలగాలు సరిహద్దు భద్రతపై నిఘా పెంచాయి. తాజా పరిస్థితులను సమీక్షించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జాతీయ భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ అత్యవసరంగా సమావేశమైంది. కేంద్ర కేబినెట్ మంత్రులందరిని ఢిల్లీకి రమ్మని కేంద్రం నుంచి ఆదేశాలు అందాయి. అంతకుముందు రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ త్రివిధ దళాలతో భేటీ అయ్యారు.పాక్ సరిహద్దుల వెంట రక్షణ పరిస్థితులను సమీక్షించారు. ఉగ్రదాడి అనంతరం పహల్గామ్ వెళ్లిన హోంశాఖ మంత్రి అమిత్ షా ఉగ్రవాదుల దాడితో నెలకొన్న పరిణామాలను సమీక్షిస్తూ భద్రతా బలగాలకు మార్గదర్శకం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధాని మోదీ అధ్యక్షతను జరిగే కేబినెట్ కమిటీ భేటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. బహుశా మరోసారి పాక్ పై భారత్ సర్జికల్ స్ట్రైక్స్ చేపట్టవన్న ప్రచారం వినిపిస్తుంది. పాకిస్తాన్ మాత్రం ఉగ్రదాడి ఘటనను ఖండిస్తూ ఓ ప్రకటన జారీ చేసింది. జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాద దాడి తర్వాత భారత సైన్యం అలర్ట్ అయింది. అత్యంత శక్తివంతమైన ధ్రువ్ హెలికాప్టర్లలో ఒకదాన్ని శ్రీనగర్ పరిసర ప్రాంతాలలో ఎగరడానికి అనుమతించింది. ఉగ్రవాదుల జాడ కనుగొనేందుకు HAL ధ్రువ్ హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు.

ఉగ్రదాడి వెనుక పాక్ హస్తం ?

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి వెనక పాకిస్తాన్ హస్తం ఉందని ఎన్ఐఏ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్ ఓవర్సీస్ పాకిస్థాన్ కన్వెన్షన్‌లో చేసిన విద్వేషపు ప్రసంగం అందులో భాగమేనని భావిస్తున్నారు. మన ఉద్దేశం స్పష్టం. కశ్మీర్ గతంలోనూ మన గొంతులోని రక్తనాళంలా ఉండేది. భవిష్యత్తులోనూ ఉంటుంది. దానిని మనం ఎప్పటికీ మరిచిపోలేం. మన కశ్మీరీ సోదరుల పోరాటంలో.. వారిని ఒంటరిగా వదిలేయం. మీరు మీ పిల్లలకు పాకిస్థాన్ కథ చెప్పండి. మన జీవితంలోని ప్రతి అంశంలోనూ హిందువుల కంటే భిన్నమని భావించిన మన పూర్వీకుల ఆలోచనలను అప్పుడే వారు గుర్తుంచుకుంటారు.మన మతాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు భిన్నమైనవి. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. మనవి రెండు దేశాలు' అని మునీర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాతే పహల్గాం దాడి చోటుచేసుకొందని.. అదే సమయంలో పాక్ వాయుసేనకు చెందిన రవాణ, నిఘా విమానాలను కరాచీ నుంచి లాహోర్, రావల్పిండి బేస్‌లకు తరలించడం కూడా అనుమానాలను బలపరుస్తోందని ఎన్ ఐఏ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుత పాక్ ఆర్మీ చీఫ్ 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై దాడి సమయంలో పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ అధిపతి కావడం గమనార్హం. పుల్వామా దాడి ఆయన ప్రోత్సాహంతోనే సాగిందన్న ఆరోపణలున్నాయి. లష్కరే తోయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫోర్స్'కు పాక్ ఆర్మీ, ఐఎస్ఐ సహకారం ఉందని ఎన్ఐఏ అంచనా వేస్తుంది.

వారితోనే సమస్య..జమ్మూకశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు!

జమ్మూకశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు ఉన్నారని భద్రతా సంస్థలు వెల్లడించాయి. భద్రతా దళాలు నిర్వహిస్తున్న రికార్డుల ఆధారంగా ఈ విషయం వెల్లడించారు. వారిలో అత్యధికంగా లష్కరే తోయిబా ముఠా సభ్యులున్నారని పేర్కొన్నాయి. 18 మంది జైషే మహమ్మద్, 35 మంది లష్కరే ఉగ్ర సంస్థలకు చెందినవారని రికార్డులు వెల్లడిస్తున్నాయి. ముగ్గురికి హిజ్బుల్ ముజాహిద్దీన్‌తో సంబంధం ఉందని, వారు కూడా పాకిస్థాన్‌కు చెందినవారని భద్రతా సంస్థలకు చెందిన అధికారి ఒకరు వెల్లడించారు. ఇక 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. విదేశీ ఉగ్రవాదులతో పోల్చుకుంటే ఆ సంఖ్య తక్కువగా ఉంది. విదేశీ ఉగ్రవాదుల సంఖ్య ఎక్కువగా ఉండటమే ఆందోళన కరంగా మారిందని భద్రతాధికారులు చెబుతున్నారు.

## అమరావతిలో మోడీ సభకు ముమ్మర ఏర్పాట్లు

అమరావతి,రాజధాని అమరావతి ప్రాంతంలో ఏపీ మంత్రి నారాయణ పర్యటించారు. ప్రధాని నరేంద్ర మోడీ సభకు వచ్చే రహదారులను ఆయన పరిశీలించారు. గుంటూరు, ఏలూరు, విజయవాడ ఇతర జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు సంబంధించి రహదారి మార్గాల విషయంలో అధికారులకు మంత్రి సూచనలు చేశారు. కొన్ని రోడ్లు వెంటనే వెడల్పు చెయ్యాలని ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి నారాయణ అధికారులకు చెప్పారు. ప్రధాని మోడీ మే 2న అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభం కోసం వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రోడ్లు, ట్రాఫిక్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాజధాని ప్రాంతంలో 64 వేల కోట్ల విలువైన టెండర్లు పిలిచాము. వచ్చే నెల 2న మరలా రాజధాని పనులు ప్రధాని మోడీ చేతుల మీదుగా రీ లాంచ్ జరుగు తుంది. వచ్చే నెల 2న ప్రధాని సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. 5 లక్షల మంది ప్రజలు బహిరంగ సభకు హాజరవుతారని అంచనా. రాజధానిలో కొన్ని రోడ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. పోలీసు శాఖ సమన్వయంతో సీఆర్డీఏ సిబ్బందితో రాజధాని ప్రాంతంలో పర్యటన చేశాం. 8 రోడ్డు మార్గాల్లో సభకు చేరుకోవచ్చు. తాడికొండ, హరిశ్చంద్రపురం, ప్రకాశం బెరేజ్.. ఇలా కొన్ని మార్గాల్లో సభకు చేరుకునే విధంగా ఏర్పాటు- జరుగుతుంది. 11 ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు- చేసాము. ప్రధాని హెలిప్యాడ్లో దిగిన తర్వాత సెక్యూరిటీ- సూచనల ప్రకారం ఒక కిమి రోడ్ షో ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు.

## పిరికిపందల పన్నాగం ఏంటీ?

జమ్ము కశ్మీర్:పహల్గాంలోని బైసరన్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపిన ఘటన భారతీయుల రక్తం మరిగేలా చేస్తోంది. ఈ దుర్ఘటనలో 26 మంది మృతి చెందారు. లష్కర్-ఎ-తైయబా (ఎల్‌ఈటీ) శాఖ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్) ఈ హత్యాకాండకు బాధ్యత వహించింది. అటువంటి పరిస్థితుల్లో ఈ దాడికి మాస్టర్‌మైండ్ ఎవరు? టీఆర్‌ఎఫ్‌కు నాయకత్వం ఎవరు వహిస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇండియా టుడే నివేదిక ప్రకారం, పహల్గాం దాడికి మాస్టర్‌మైండ్ లష్కర్ గ్రూప్‌నకు చెందిన సైఫుల్లా కసూరి అని, టీఆర్‌ఎఫ్ సమూహానికి ఆసిఫ్ ఫౌజీ నాయకత్వం వహిస్తున్నాడని తెలుస్తోంది. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను ఇచ్చే ఆర్టికల్ 370ని ఆగస్టు 5, 2019న రద్దు చేశారు. అప్పటి నుంచి ఉగ్రవాద కార్యకలాపాలతోపాటు రాళ్ల దాడి ఘటనల్లో తగ్గుదల కనిపించింది. మరోవైపు ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఈ ఉగ్రవాద సంస్థ ఏర్పాటు అయింది.

టీఆర్‌ఎఫ్‌కు ఎవరు నాయకత్వం వహిస్తున్నారు?

టీఆర్‌ఎఫ్‌కు సైఫుల్లా కసూరి నాయకత్వం వహిస్తున్నాడు. పాకిస్థానీ ఉగ్రవాద సమూహం లష్కర్-ఎ-తైయబా (ఎల్‌ఈటీ) సీనియర్ కమాండర్ సైఫుల్లా కసూరి, లేదా ఖాలిద్ ఈ పహల్గాం దాడికి మాస్టర్‌మైండ్ అని చెబుతున్నారు. కసూరిని ఎల్‌ఈటీ స్థాపకుడు హఫీజ్ సయీద్ సన్నిహిత సహచరుడిగా కూడా భావిస్తున్నారు. ఈ దాడి జాగ్రత్తగా ప్లాన్ చేసినట్టు ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. ఉగ్రవాదులు సైలెంట్‌గా ఉంటూ భారీ ప్రాణనష్టం కలిగించడానికి సరైన సమయం కోసం ఎదురుచూశారు. ఇద్దరు వీఐపీలు కీలకమైన పర్యటనలో ఉన్న టైంలోనే దాడి జరిగింది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్ భారత పర్యటనలో ఉన్నారు. అదే టైంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సౌదీ అరేబియా పర్యటనలో ఉన్నారు.

ఎల్‌ఈటీలో ఖాలిద్ పాత్ర ఏమిటి?

టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదికలో అమెరికన్ ట్రెజరీని ఉటంకిస్తూ, సైఫుల్లా కసూరి లేదా ఖాలిద్‌ను హఫీజ్ సయీద్ జమాత్-ఉద్-దావా (జేయూడీ) రాజకీయ విభాగం, మిల్లి ముస్లిం లీగ్ (ఎమ్‌ఎమ్‌ఎల్) అధ్యక్షుడిగా చేశారని, 8 ఆగస్టు 2017న ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పార్టీ ఏర్పాటు, లక్ష్యాలు, ఉద్దేశాల గురించి మాట్లాడారని తెలిపింది.ఖాలిద్ (ఎల్‌ఈటీ) పెషావర్ ప్రధాన కార్యాలయం ముఖ్యుడు. జేయూడీ ఆధ్వర్యంలో మధ్య పంజాబ్ ప్రాంతానికి సమన్వయ కమిటీలో పనిచేశాడు. జేయూడీని ఏప్రిల్ 2016లో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 13224 ప్రకారం అమెరికన్ విదేశాంగ శాఖ ఎల్‌ఈటీ ఉపశాఖగా పేర్కొంది. డిసెంబర్ 2008లో దీనిని ఎల్‌ఈటీకి చెందినశాఖగా ఐక్యరాజ్యసమితి 1267/1988 నిషేధ జాబితాలో చేర్చింది.

టీఆర్‌ఎఫ్ అంటే ఏమిటి?

ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్)ని 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఏర్పాటు చేశారు. నిషేధంలో ఉన్న లష్కర్-ఎ-తైయబా శాఖ. అధికారుల సమాచారం, మతపరమైన ముద్రపడకుండా ఉంటూ కశ్మీర్ ఉగ్రవాదాన్ని లోకలైజ్ చేయడానికి ఈ పేరు ఎంచుకున్నారు. 'రెసిస్టెన్స్' అనే పదం ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించడానికి చేర్చారని అధికారులు అంటున్నారు. లోయలోని జర్నలిస్టులనుకూడా టీఆర్‌ఎఫ్ బెదిరించింది. ఇలా పలు ఉగ్రవాద కార్యక్రమాల్లో పాల్గొనడంతో దీన్ని కేంద్ర హోంశాఖ అక్రమ కార్యకలాపాలు (నివారణ) చట్టం (యూఏపీఏ) కింద ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. ఆ శాఖ నోటిఫికేషన్ ప్రకారం, టీఆర్‌ఎఫ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా యువతను ఉగ్రవాద కార్యకలాపాలకు నియమించుకుంటోంది. ఇందులో ఉగ్రవాదుల చొరబాటు, పాకిస్థాన్ నుంచి జమ్మూ-కశ్మీర్‌కు ఆయుధాలు, మత్తుపదార్థాల అక్రమంగా తరలించడంలో సహాయపడుతోంది. 2019లో టీఆర్‌ఎఫ్ స్థాపించినప్పుడు షేక్ సజ్జాద్ గుల్ టాప్ కమాండర్‌గా ఉగ్రవాద సంస్థకు నాయకత్వం వహించాడు. అయితే బాసిత్ అహ్మద్ దార్ చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా పనిచేశాడు. టీఆర్‌ఎఫ్ హిజ్బుల్ ముజాహిదీన్ , లష్కర్ వంటి అనేక సంస్థల ఉగ్రవాదుల మిశ్రమ సంస్థగా చెబుతున్నారు. జమ్మూ-కశ్మీర్‌లో పౌరులు, భద్రతా దళాలపై జరిగిన చాలా దాడులను ది రెసిస్టెన్స్ ఫోర్స్ (టీఆర్‌ఎఫ్) చేసింది. ఇందులో గందర్‌బాల్ దాడి కూడా ఉంది. అక్టోబర్ 2024లో శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై ఒక సొరంగ నిర్మాణ ప్రదేశాన్ని ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నప్పుడు ఒక డాక్టర్, ఆరుగురు స్థానికేతర కార్మికులు మరణించారు. జమ్మూ-కశ్మీర్ పోలీసుల ప్రకారం, 2022లో లోయలో ఈ సంస్థకు చెందిన వారినే ఎక్కువమందిని అదుపులోకి తీసుకున్నారు. లష్కర్-ఎ-తైయబా అత్యంత క్రియాశీల ప్రాక్సీల్లో టీఆర్‌ఎఫ్ ఒకటి అని చెబుతున్నారు.

పహల్గాం ఉగ్రవాద దాడికి నాయకత్వం ఎవరు వహించారు?

పహల్గాం హత్యాకాండ జరిగిన గంటల్లోనే దాడికి బాధ్యతను రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్) వహించింది. జమ్మూ-కశ్మీర్ పోలీసులు హత్యాకాండలో పాల్గొన్న ముగ్గురు దాడి చేసిన వారి స్కెచ్‌లను విడుదల చేశారు. ముగ్గురు ఉగ్రవాదులను ఆసిఫ్ ఫూజీ, సులేమాన్ షా, అబూ తల్హాగా గుర్తించారు. దీనికి ఆసిఫ్ ఫౌజీ నాయకత్వం వహించినట్టు జాతీయ మీడియా చెబుతోంది. కొన్ని నివేదికలు అతను స్థానిక ఉగ్రవాది అని చెప్పగా, మరికొన్ని అతను పాకిస్థానీ సైన్యంతో పనిచేస్తున్నాడని, అందుకే అతని పేరు ఫౌజీ అని పేర్కొన్నాయి. చూసినవారు ఇద్దరు ఉగ్రవాదులు పష్తోలో మాట్లాడుతున్నారని చెప్పారు, ఇది పాకిస్థానీ మూలాన్ని సూచిస్తుంది, అయితే వారిలో ఇద్దరు బిజ్‌భేరా, త్రాల్‌కు చెందిన స్థానికులు అని తెలిసింది.

# "వాణిజ్యం రద్దు, ఎయిర్ స్పేస్ మూసివేత, సైన్యానికి సెలవులు రద్దు"..



పాకిస్తాన్, భారత్ చర్యలపై ప్రతీకార చర్యలకు దిగింది. గురువారం పాకిస్తాన్ "సిమ్లా ఒప్పందం" సహా భారత్‌తో ఉన్న అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలను నిలుపుదల చేసుకునే హక్కును వినియోగించుకుంటామని తెలిపింది. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ అధ్యక్షతన ఈ రోజు జాతీయ భద్రత కమిటీ(ఎన్ఎస్‌సీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్మీ అధికారులతో పాటు ఆ దేశంలోని కీలక అధికారులు హాజరయ్యారు. పాకిస్తాన్ "సింధు జలాల ఒప్పందాన్ని" భారత్ రద్దు చేయడాన్ని తీవ్రంగా తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. సింధు జలాల ఒప్పందం ప్రకారం, పాకిస్తాన్‌కి చెందిన నీటి ప్రవాహాన్ని ఆపడానికి లేదా మళ్లించడానికి చేసే ఏ ప్రయత్నాన్నైనా పాకిస్తాన్ తీవ్రంగా తిరస్కరిస్తున్నట్లు చెప్పింది. దిగువ నదీ తీరహక్కులను ఆక్రమించడాన్ని ''యుద్ధ చర్య''గా భావిస్తున్నట్లు పేర్కొంది. పహల్గామ్ ఉగ్రదాడితో భారత్ ఇప్పటికే పాకిస్తాన్‌తో దౌత్య సంబంధాలు పూర్తిగా తగ్గించుకుంది. పాక్ జాతీయులకు వీసాలు రద్దు చేసింది. ఇండస్ వాటర్ ట్రీటీని రద్దు చేసింది. పాకిస్తాన్-భారత్ సరిహద్దును మూసేసింది. దీంతో ఇప్పుడు పాకిస్తాన్ కూడా ప్రతీకార చర్యలకు దిగుతోంది. ''భారతదేశ యాజమాన్యంలోని లేదా భారత్ దేశం నిర్వహించే అన్ని విమానయాన సంస్థలకు పాకిస్తాన్ గగనతలాన్ని తక్షణమే మూసేస్తున్నాం" అని పాకిస్తాన్ ప్రకటించింది. భారతతో వాణిజ్యాన్ని నిలిపేస్తున్నట్లు చెప్పింది. వాఘా సరిహద్దు పోస్టును మూసేస్తున్నామని, హైకమిషన్ సంఖ్యను 30కి తగ్గిస్తామని మరియు భారత హైకమిషన్ నుండి రక్షణ సేవల అధికారులను బహిష్కరిస్తామని కూడా ఇది పేర్కొంది. మరోవైపు, పాకిస్తాన్ తన యుద్ధ విన్యాసాలను ఎక్కువ చేసింది. క్షిపణి పరీక్షల్ని నిర్వహిస్తోంది. సరిహద్దుల్ని అలర్ట్ చేసింది. సైన్యంలో సెలవుల్ని రద్దు చేసింది. భారత్ దాడి చేస్తే తిప్పికొట్టాలని పాక్ ఆర్మీకి ఆదేశాలు అందాయి. ఇప్పటికే భారత సరిహద్దుల్లో ఉన్న పాక్ గ్రామాల్లోని ప్రజల్ని అక్కడి ఆర్మీ ఖాళీ చేయించింది.

# సగం పాకిస్థాన్ ఎడారి అవుతుందా?

న్యూఢిల్లీ,భారత్-పాక్ మధ్య దాదాపు 65 ఏళ్లుగా ఓ ఒప్పందం నడుస్తోంది. దీన్ని ఇప్పటివరకు ఎవ్వరూ కెలకలేదు. టచ్ చేయాలని కూడా అనుకోలేదు. అదే సింధు నదీ జలాల ఒప్పందం. సింధు నదితో పాటు మిగతా 5 నదుల జలాల పంపిణీకి సంబంధించిన కీలక ఒప్పందం ఇది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో ఏర్పాటైన ఈ ఒప్పందం ఇన్నాళ్లూ సజావుగా అమలవుతూ వస్తోంది. రెండు దేశాల మధ్య ఎన్ని ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినా, యుద్ధాలు జరిగినా ఈ ఒప్పందానికి తూట్లు పొడిచేలా భారత్ ఎప్పుడూ వ్యవహరించలేదు. దీనికి కారణం ఒకే ఒక్కటి, అదే మానవతా దృక్పథం. ఈ ఒప్పందాన్ని భారత్ ఉల్లంఘించిందంటే పాకిస్థాన్ కొన్నేళ్లకు ఎడారిగా మారిపోతుంది. భారత్ పై నుంచి పాక్ కు వెళ్లే నదులివి. పాకిస్థాన్ వ్యవసాయ రంగానికి, తాగునీటికి కీలకమైన ఈ నదుల ప్రవాహాన్ని భారత్ అడ్డుకోకూడదనేది ఒప్పందం. అందుకే ఇప్పటివరకు ఈ నదులుపై ఎలాంటి ఆనకట్టలు నిర్మించలేదు భారత్. నదీ ప్రవాహాన్ని అడ్డుకుంటే, పాక్ కు నీటి సరఫరా తగ్గిపోతుంది. ఫలితంగా అక్కడ వ్యవసాయ భూమి బీడుగా మారుతుంది. ఇప్పుడు పహల్గాం ఘటనతో భారత్ ఈ కీలకమైన ఒప్పందం నుంచి బయటకు వచ్చేసింది. సింధు నదీ జలాల ఒప్పందం (ఇండస్ వాటర్ ట్రీటీ) నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. దీంతో రాబోయే రోజుల్లో ఈ నదీ జలాల్ని భారత్ ఎలాగైనా వాడుకోవచ్చు. అవసరమైతే ఆనకట్టలు కట్టుకోవచ్చు. ఇప్పటికే ఉన్న ఆనకట్టల నుంచి కావాలంటే నీటిని కిందకు వదిలేయొచ్చు, లేదంటే ఆపుకోవచ్చు. ఈ రెండింటిలో ఏది చేసినా నష్టమే. పంట చేతికొచ్చే టైమ్ కు నీటిని వదిలితే పంటలన్నీ నాశనం అవుతాయి.



నీరు కావాల్సిన టైమ్ లో ఆపితే పాక్ గొంతెండిపోతుంది. ఇలా పాక్ ను ఇరకాటంలో పెట్టేసింది భారత్. ఇప్పటికే పాక్ లో భూగర్భ జలాలు అడుగంటాయి. ఇలాంటి టైమ్ లో ఒప్పందం అమలవ్వకపోతే, 15 ఏళ్లలో పాకిస్థాన్ లోని పంజాబ్ ప్రావిన్స్ మొత్తం బీడుగా మారుతుందంటున్నారు విశ్లేషకులు. అయితే ట్రీటీ నుంచి తప్పుకున్నంత మాత్రాన, ఇప్పటికిప్పుడు పాకిస్థాన్ కు వచ్చే నష్టం లేదు. భవిష్యత్తులో ఈ నదులపై భారత్ చేపట్టే ప్రాజెక్టులపై పాక్ భవితవ్యం ఆధారపడి ఉంటుంది. ఇది చాలామంది భారతీయులకి నచ్చలేదు. ఒప్పందం నుంచి తప్పుకోవడం బాగానే ఉంది కానీ, ఇప్పటికిప్పుడు ప్రతీకార చర్య తీసుకోవాలని, అవసరమైతే సర్జికల్ స్ట్రయిక్ కు వెళ్లాలని సోషల్ మీడియాలో డిమాండ్స్ వినిపిస్తున్నాయి.

# ట్రంప్ నిర్ణయానికి కోర్టులో చుక్కెదురు



వాషింగ్టన్,వీసాల రద్దుతో ఇబ్బంది పడ్డ భారత్ విద్యార్థులకు ఊరట దక్కింది. వీరితో పాటు పలుదేశాలకు చెందిన వారు కూడా ఉన్నారు. అమెరికాలో ట్రంప్ కార్యవర్గం 133 మంది విద్యార్థులకు నిలిపేసిన ఎస్ఈవీఐఎస్ అంటే స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను న్యాయస్థానం పునరుద్ధరించింది. దీనిలో అధిక మంది భారత్‌కు చెందినవారున్నారు. అమెరికా విదేశాంగశాఖ వీరి వీసాలను రద్దు చేయడంతోపాటు ఎస్ఈవీఐఎస్‌ను టెర్మినేట్ చేయడంపై వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అమెరికాలో చాలామంది భారతీయులు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ అంటే ఓటిపి కింద ఉన్నారు. దీంతో వారికి తాత్కాలికంగా పనిచేసే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా స్టెమ్ సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ చేసిన వారికి ఈ అవకాశం లభిస్తుంది. దాదాపు 36 నెలల పాటు- అక్కడ పని చేయవచ్చు. ఈ సమయాన్ని వారు హెచ్-1బీ వర్క్ వీసా వంటివి సాధించేందుకు వారధిగా వాడుకొంటారు. ఓపీటీ- స్టేటస్ పోతే అమెరికాలో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. మరోవైపు అక్కడి ప్రభుత్వ ఏజెన్సీల వాదన భిన్నంగా ఉంది. ఈ విద్యార్థులు పలు సందర్భాల్లో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల దృష్టిలోపడ్డారని చెబుతున్నాయి. ఈనేపథ్యంలో తాము తాత్కాలికంగా అడ్డుకొనేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు చెబుతున్నాయి. కానీ, ఈ విద్యార్థులకు ఎటువంటి నేర చరిత్ర లేదు. ఇక ఇమిగ్రేషన్ లాయర్లు మాత్రం ప్రభుత్వ నిర్ణయం సరికాదని పేర్కొంటున్నారు. విద్యార్థులు ఏ తీవ్ర నేరాలు చేయకపోయినా.. వారి లీగల్ స్టేటస్‌లను తొలగించారన్నారు. తాజాగా ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి చాలా చిన్న కారణాలతోనే విద్యార్థి వీసాలను రద్దు చేస్తున్నారని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఒక విద్యార్థిపై గృహహింస కేసు నమోదైందని వీసా రద్దు చేశారు. తాజాగా రద్దయిన 327 మందిలో కేవలం ఇద్దరు మాత్రమే స్వల్ప రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అసలు అమెరికా విదేశాంగ శాఖ వీసాలను రద్దు చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని లాయర్లు పేర్కొంటు-న్నారు. 'క్యాచ్ అండ్ రివోక్' పేరిట అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో విద్యార్థి వీసా ఉన్నవారి పరిస్థితిని ఏఐ టూల్స్‌తో సమీక్షిస్తా రు. చివరికి వారి సోషల్ మీడియాను కూడా పరిశీలిస్తారు. ఈ ప్రోగ్రామ్ కింద దాదాపు 300 మంది విద్యార్థుల వీసాలు రద్దయ్యాయి. వీరిలో సగం మంది భారతీయులు,చైనీయులు,నేపాలీలు,దక్షిణ కొరియా,బంగ్లాదేశ్ వాసులున్నారు.

# బెట్టింగ్ యాప్స్ : ఎవ్వరినీ వదలడం లేదు కదా

హైదరాబాద్,బెట్టింగ్ అంటే అదో విష వృక్షం. అది దేన్ని వదలడం లేదు. ఎవ్వరినీ ఉపేక్షించడం లేదు. .చోటా మోటా నటులతో మొదలైన ఈ బెట్టింగ్ యాప్ కేసులు స్టార్ హీరోల వరకూ పాకింది. ఇప్పుడు ప్రభుత్వ వ్యవస్థలోని కీలక విభాగాలకు విస్తరించింది. చూస్తుంటే ఈ బెట్టింగ్ కేసులు ఎవ్వరినీ వదిలేలా కనిపించడంలేదు. హైదరాబాద్ మెట్రో రైలులో బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ప్రదర్శనపై తెలంగాణ హైకోర్టు సీరియస్ అయింది. ఈ విషయమై హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)కి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. బెట్టింగ్ యాప్‌ల ప్రకటనలపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. న్యాయవాది నాగూర్ బాబు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం పై హైకోర్టు విచారణ చేపట్టింది. మెట్రో రైళ్లలో బెట్టింగ్ యాప్‌లను చట్టవిరుద్ధంగా ప్రచారం చేస్తున్నారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌పై సీబీఐ, ఈడీ విచారణ జరపాలని కూడా ఆయన కోర్టును కోరారు. మెట్రో రైలు ప్రజారవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, అలాంటి సంస్థ ఇటువంటి అక్రమాలకు పాల్పడటం సరికాదని పిటిషనర్ వాదించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. కాగా, తెలంగాణ ప్రభుత్వం బెట్టింగ్ యాప్‌లపై ఇప్పటికే కఠిన చర్యలు తీసుకుంటోంది. పలువురు



సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, సెలబ్రిటీలపై కేసులు నమోదు చేసింది. బెట్టింగ్ యాప్‌లపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) కూడా ఏర్పాటు చేసింది. మెట్రో రైలు కోచ్‌లలో బెట్టింగ్ యాప్ ప్రకటనలు ప్రముఖంగా కనిపించడంపై గతంలో పలువురు సామాజిక కార్యకర్తలు, విజిలెన్స్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా, ఈ వ్యవహారంపై హైకోర్టు స్పందించి మెట్రో రైలు అధికారులకు నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ధాన్యం కొనుగోళ్లలో తిరకాసులు...రైతులను నిండా ముంచుతున్న మిల్లర్లు

ఖమ్మం, జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల తరుగు విషయంలో కొందరు మిల్లర్లు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతుంది. రైతుల నుంచి ధాన్యం సేకరణ సమయంలో ఎలాంటి తరుగు తీయొద్దని మంత్రులు, కలెక్టర్లసహా అధికారులు స్పష్టంగా చెబుతున్నా మిల్లర్లు పట్టించుకోవడం లేదు. రెండు, మూడు రోజులుగా క్వింటాకు 4 నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తేనే ధాన్యం కొనుగోలు చేస్తామని, మిల్లు దగ్గరకు లోడ్ వచ్చినా తరుగు తీస్తేనే అన్‌లోడ్ చేసుకునేందుకు ఒప్పుకుంటామని మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా మిల్లర్లకు భయం కలగడం లేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఖమ్మం జిల్లాలో ఈ సీజన్ లో 1.85 లక్షల టన్నుల సన్న ధాన్యం, 73 వేల టన్నుల దొడ్డు రకం ధాన్యం కలిపి మొత్తం 2.58 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 1,317 మంది రైతుల నుంచి రూ. 24.66 కోట్ల విలువైన 10,628.760 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 8,900 టన్నుల సన్న రకం ధాన్యం కాగా, మిగతాది దొడ్డు రకం ధాన్యమని అధికారులు చెబుతున్నారు. రైస్ మిల్లుల దగ్గర, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో తరుగు పేరిట కోతలు లేకుండా పర్యవేక్షణ జరుపుతున్నామని ఒకవైపు ఆఫీసర్లు చెబుతున్నా, తరుగు తీస్తేనే కాంటాలు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తయిన ధాన్యాన్ని తరలించేందుకు సరైన సమయంలో లారీలు అందుబాటులో ఉండడం లేదు. మరికొన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు అందుబాటులో లేని కారణంగా ఇప్పటి వరకు కాంటాలు ప్రారంభం కాలేదు. కారేపల్లి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో మాదారం, సొసైటీ- ఆధ్వర్యంలో విశ్వనాథపల్లి, సీతారాంపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు- చేశారు. విశ్వనాథపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి కొందరు రైతులు మూడు రోజుల కిందనే ధాన్యం తీసుకొచ్చారు. బస్తాలు లేకపోవడంతో నిర్వాహకులు కొనుగోలు



ప్రారంభించలేదు. కారేపల్లి సొసైటీ- సిబ్బంది 20 రోజుల కిందనే జిల్లా సివిల్ సప్లై అధికారికి బస్తాలు కావాలని ఇండెంట్ కూడా పెట్టారు. ఇప్పటి వరకు బస్తాలు రాలేదు. గన్నీ బస్తాల కొరతతో కొనుగోలు ప్రారంభించకపోవడంతో కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇకపోతే కొనుగోలు కేంద్రాల్లో తరుగు విషయంలో మిల్లర్లు ఇబ్బంది పెడుతుండడంతో బాధిత రైతులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు మిల్లర్లు కూడా తమ పరిస్థితిని సమర్థించుకుంటున్నారు. తాము క్వింటాకు 67 కిలోల బియ్యాన్ని లేవీగా ఇవ్వాల్సి ఉంటుందని, ఈ సీజన్ లో పండిన ధాన్యాన్ని మర ఆడిస్తే 60 కిలోలు మాత్రం బియ్యం వస్తున్నాయని చెబుతున్నారు. ఎక్కువ వేడి కారణంగా బియ్యం నూకగా మారడంతో తాము నష్టపోతున్నామని, ధాన్యం తరుగు తీస్తేనే తమకు గిట్టుబాటు- అవుతుందని అంటున్నారు. ఒకవైపు అకాల వర్షాలతో ఎప్పుడు వాన కురుస్తుందోనన్న భయం ఉండగా, కాంటాలు పూర్తయిన ధాన్యాన్ని తరలించకపోవడంతో వాటిపై పట్టాలు కప్పి అక్కడే నిల్వ ఉంచారు.

# పవన్ ఎక్కడ ?



అమరావతి,పవన్ కళ్యాణ్ ఈ రోజున ఒక బాధ్యత కలిగిన ఎమ్మెల్యే, అంతే కాదు టీడీపీ కూటమి ప్రభుత్వంలో బాధ్యత కలిగిన ఉప ముఖ్యమంత్రి. అవును పవన్ ఎక్కడ. దీని మీదనే అంతా చర్చిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఈ రోజున ఒక బాధ్యత కలిగిన ఎమ్మెల్యే, అంతే కాదు టీడీపీ కూటమి ప్రభుత్వంలో బాధ్యత కలిగిన ఉప ముఖ్యమంత్రి. ప్రభుత్వంలో చంద్రబాబుతో కలసి ఆయన పనిచేస్తున్నారు. ఈ ఇద్దరూ కూటమికి కీలకం అని అంతా అనుకుంటున్న వేళ పవన్ మాత్రం చడీ చప్పుడూ లేకుండా ఉన్నారన్నది అంతా అనుకునే మాట. అదేదే సినిమాలో పాట మాదిరిగా మౌనమే నా భాషా అని పవన్ అనుకుంటున్నారా అని భావిస్తున్నారు కూడా. నిజానికి పవన్ కి మరో పేరు ప్రశ్న. ఆయన ప్రశ్నిస్తాను అనే అధికారంలోకి వచ్చారు. అలాగే ఆయన అందలం ఎక్కారు. ఆయన వైసీపీ ప్రభుత్వాన్ని అయిదేళ్ళ పాటు బాగానే ప్రశ్నించారు. దాంతో ఆయన నాయకత్వ పటిమను చూసి అంతా శభాష్ పవన్ అన్నారు. ఇలాంటి వారు అధికారంలో ఉండాలని కూడా బలంగా కోరుకున్నారు. దాని ఫలితమే ఆయన డిప్యూటీ సీఎం పదవి. అయితే గడచిన పది నెలల కాలంలో పవన్ ప్రశ్నించిన సందర్భాలు చాలా తక్కువగానే ఉన్నాయని అంటున్నారు. అది కూటమి ప్రభుత్వం అయినా కూడా తప్పు ఉంటే తప్పు అని మొదట్లో పవన్ బాగానే నిలదీసిన సందర్భాలు ఉన్నాయి. సీజ్ ది షిప్ అని అన్నా దాని కంటే ముందు లా అండ్ ఆర్డర్ మీద ఆయనే నేరుగా అసంతృప్తి వ్యక్తం చేసినా పవన్ గ్రేట్ అనుకున్నారు. ఇక తిరుపతిలో ముక్కోటి ఏకాదశి టికెట్ల పంపిణీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట నేపధ్యంలో పవన్ టీటీడీ బోర్డునే టార్గెట్ చేశారు. దాంతో పవన్ కి ఆస్తిక జనుల నుంచి మంచి మద్దతు లభించింది. అయితే ఇటీవల కాలంలో ఏపీలో అనేక సంఘటలు జరుగుతున్నా పవన్ వాయిస్ ఏమిటి అన్నది తెలియడంలేదు అంటున్నారు. ఇపుడు చూస్తే ఏపీలో ఉర్సా కుంభకోణం అని అంటున్నారు. అది కూడా కూటమి ఎంపీ మీద సాక్షాత్తూ ఆయన సోదరుడే ఆరోపణలు చేస్తున్నారు. ఇది అంతకంతకు తీవ్రమైన ఇష్యూగా మారుతోంది. అయినా సరే పవన్ మాట్లాడకపోవడం పట్ల అంతా ఆలోచిస్తున్నారు. ఉత్తిత్తి కంపెనీలకు భూములు పెద్ద ఎత్తున ఇస్తున్నారని విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రిగా జనసేన అధినేతగా పవన్ ఈ ఇష్యూ మీద రెస్పాండ్ కావాల్సి ఉంది కదా అంటున్నారు. విశాఖ వంటి ప్రధానమైన ఏరియాలో 99 పైసలు లెక్కన మూడు వేల కోట్ల రూపాయలు విలువ చేసే భూములను ఇవ్వడం పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న నేపథ్యంలో పవన్ నోరు విప్పాలి కదా అని అంటున్నారు. అంతే కాదు ఏపీలో పారిశ్రామిక విధానం మీద జనసేన తన స్టాండ్ ఏంటో చెప్పి పరిశ్రమలు వచ్చేలా చూడడమే కాకుండా ప్రజల సొత్తు కూడా ఇబ్బందుల పాలు కాకుండా చూడాల్సి ఉంది కదా అని అంటున్నారు. మరో వైపు చూస్తే అమరావతి రాజధాని పేరు మీద గతంలోనే 34 వేల ఎకరాల భూములను సేకరించారు వాటి పనులే మే 2న ప్రారంభం అవుతున్నాయి. అయితే ఇపుడు మరో 40 వెల ఎకరాలను అమరావతి రాజధాని విస్తరణ కోసం ఇంకా భూములు తీసుకుంటారు అని ప్రచారం జరుగుతుంది దీని మీద కూడా భూములు ఇచ్చిన రైతులతో పాటు అన్ని వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. అమరావతికి ఎక్కువ భూములు అవసరం లేదని గతంలో చెప్పిన వారూ ఉన్నారు. ఇక జనసేన అయితే అమరావతి రాజధానిని కట్టమని అంటోంది. మరి ఈ అదనం భూముల విషయంలో ఆ పార్టీ ఆలోచనలు ఏమిటో చెప్పాల్సి ఉంది కదా అని అంటున్నారు. ఏది ఏమైనా ఇవన్నీ ఫవన్ కి తెలిసి జరిగాయా లేదా అన్నది కూడా చర్చకు వస్తోంది. అలాగే ఏపీలో కూటమి పేరు మీద సాగుతున్న పాలనలో పవన్ భాగస్వామ్యం ఎంత ఉంది అన్నది కూడా మరో చర్చగా ఉంది. ఒకవేళ పవన్ కి ఈ కీలకమైన నిర్ణయాల గురించి ఏమీ తెలియకపోయినా ఇబ్బందే. ఒకవేళ తెలిసి జరుగుతున్నా ఆయన చెప్పాల్సింది చెప్పి నిర్మాణాత్మకంగా వ్యవహరించకపోయినా ఇబ్బందే అని అంటున్నారు. ఇవే కాదు పది నెలలలో ఏపీలో సాగుతున్న కూటమి పాలన గురించి పవన్ కి ఎంత వరకూ తెలుసు. ప్రభుత్వం తీసుకునే కీలక నిర్ణయాలలో ఆయన పాత్ర ఏ మేరకు ఉంది అని అంటున్నారు. ఎందుకంటే ఏ డెసిషన్ అయినా కూటమి పేరు మీదనే బయటకు ప్రొజెక్ట్ అవుతుంది. రేపటి రోజున ప్రజా వ్యతిరేక నిర్ణయం అయితే ఆ విమర్శలు జనసేనకు కూడా వస్తాయని ఆ పార్టీ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని అంటున్నారు.

# రాష్ట్రపతి ముందు రెడ్ ఫైల్... ఇక అతి భీకరమే !

న్యూఢిల్లీ,భారత్ ఇక అతి భీకరమైన యుద్ధానికి తెర తీసే సూచనలు కనిపిస్తున్నాయి. గట్టిగా భారతీయులు అంతా కలిసి గాలి వదిలితే అదే సుడిగాలిగా సునామీగా మారి పాకిస్థాన్ అందులో కొట్టుకుని పోతుంది అని అంటూంటారు. ఇపుడు అలాంటి పరిస్థితినే పాక్ చూడబోతోంది అని అంటున్నారు. ఏ విధంగా చూసినా భారత్ తో సమ ఉజ్జీ కానీ పాక్ కి శాశ్వతమైన గుణపాఠం చెప్పడానికి భారత్ చూస్తోంది అని అంటున్నారు. నిన్నా అమిత్ షా రాజ్ నాథ్ సింగ్ ఉగ్రవాదుల భరతం పడతాం అని చేసిన వ్యాఖ్యలకు మించి ఈ రోజున ప్రధాని నరేంద్ర మోడీ బీహార్ లో మాట్లాడుతూ వెంటాడి వేటాడి భారత్ ఏంటో ఉగ్రమూకలకు చూపిస్తామని గర్జించిన తీరు చూసిన వారికి కేంద్ర ప్రభుత్వం ఎంత సీరియస్ గా ఉందో అర్థం అవుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత రాష్ట్రపతి సర్వ సైన్య అధ్యక్షురాలు అయిన ద్రౌపది ముర్ము వద్దకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్ వెళ్ళి తాజా పరిణామాలు కాశ్మీర్ ఉగ్ర దాడి గురించి ఆమెకు వివరించారు అని చెబుతున్నారు. అంతే కాదు రాష్ట్రపతి ముందు రెడ్ ఫైల్ ని ఉంచారని అంటున్నారు. మరి ఆ రెడ్ ఫైల్ లో ఏమి ఉందో తెలియదు కానీ పాకిస్థాన్ మీద భయంకరమైన ప్రతీకారానికి భారత్ సిద్ధమవుతోంది అని సంకేతాలు వినిపిస్తున్నాయి. ఇంకో వైపు చూస్తే వివిధ దేశాలకు చెందిన రాయబారులకు భారత్ ఉగ్ర దాడి గురించి వివరించింది. భరత విదేశాంగ శాఖ అధికారులు రష్యా జర్మనీ, జపాన్, పోలెండ్, యూకే, తదితర ఇరవైకి పైగా దేశాలకు చెందిన రాయబారులతో ఈ ఉగ్రదాడి వెనక ఎవరు ఉన్నారో కూడా పూసగుచ్చినట్లుగా వివరించారు అని అంటున్నారు. ఇక ఈ ఉగ్ర దాడికి పాల్పడింది తామే అని లష్కరే తోయిబా అనుబంధ ఉగ్ర సంస్థ ఇప్పటికే ప్రకటించింది. దీంతో పాకిస్థాన్ ప్రమేయం కూడా ఈ దాడి వెనక ఉందని



స్పష్టం అయింది అని అంటున్నారు. పాక్ జోక్యం పూర్తిగా ఉంది అన్న ఆధారాలు కూడా భారత ఇంటలిజెన్స్ వర్గాలు సేకరించాయని చెబుతున్నారు. వాటిని అన్నింటినీ కూడా భారత్ విదేశీ రాయబారులకు పూర్తివా వివరించిందని చెబుతున్నారు. రేపటి రోజున భారత్ పాకిస్థాన్ మీద ఏ రకమైన కఠిన చర్యలు చేపట్టినా అంతర్జాతీయ సమాజం మద్దతు కూడగట్టేందుకు ఈ విధంగా భారత్ వ్యవహరిస్తోంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే పాకిస్థాన్ సైతం యుద్ధ సన్నాహాలలో ఉంది. భారత్ మూడ్ ని గమనిస్తోంది. దానికి అనుగుణంగా వేగంగా అడుగులు వేస్తోంది. ఇక రెండు దేశాలూ అణు సామర్థం కలిగినవే. యుద్ధమంటూ వస్తే అది సంప్రదాయ యుద్ధంగానే ఉండదు అని పాక్ తన దూకుడుతో అణు యుద్ధం దాకా పరిస్థితిని తెస్తుందా అన్న చర్చ కూడా ఉంది. ఏది ఏమైనా భారత్ దే ఈ యుద్ధంలో పై చేయి అవుతుందని అంటున్నారు. మొత్తానికి చూస్తే భారత్ పట్టుదల చూస్తూంటే పాక్ పీచమణచడం ఖాయంగా కనిపిస్తోంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com